మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

నేటి
# ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

బుధవారం WEDNEDAY 26-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 147 Issue: 147

Published from Jagitial
www.evarthalu.com

26 నవంబర్ 2025 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:30 సూర్యాస్తమయం - సా. 5:35 తిథిః షష్ఠి రా. 11:58 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం శ్రవణ రా. 1:21o వరకు తరువాత ధనిష్ఠ యోగం వృద్ధి మ. 12:35 వరకు కరణం కౌలవ ఉ. 11:31 వరకు తైతుల రా. 11:58 వరకు వర్జ్యం తె. 5:42 నుండి ఉ. 7:22 వరకు దుర్ముహూర్తం ఉ. 11:41 నుండి మ. 12:25 వరకు రాహుకాలం మ. 12:03 నుండి మ. 1:26 వరకు యమగండం ఉ. 7:54 నుండి ఉ. 9:17 వరకు గుళికాకాలం ఉ. 10:40 నుండి మ. 12:03 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:54 నుండి తె. 5:42 వరకు అమృత ఘడియలు మ. 2:26 నుండి సా. 4:09 వరకు అభిజిత్ ముహూర్తం లేదుః గమనిక: "o" అనగా మరుసటి రోజున



# రామమందిరంపై కాషాయ రెపరెపలు

## అయోధ్యలో అట్టహాసంగా ధ్వజారోహణ

ప్రధాని చేతుల మీదుగా కార్యక్రమం.. భూగోళం మొత్తం రాముని భక్తిలోనే: మోదీ

అయోధ్యలో రామమందిర నిర్మాణం పనులు ముగిశాయి. దీనికి సంకేతంగా అయోధ్యంలో ధ్వజారోహణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ చారిత్రక వేడుక కోసం 100 టన్నుల పుష్పాలతో సర్వాంగ సుందరంగా ఆలయం, పరిసరాలను అలంకరించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ధ్వజారోహణం ఎగురువేశారు. సరిగ్గా అభిజిత్ లగ్నంలో ఈ వేడుక జరిగింది. మొత్తం 7 వేల మంది అతిథులు ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చారు.

2




# ప్రపంచం మెచ్చిన బ్రహ్మోస్ క్షిపణులు

భారత 'బ్రహ్మోస్త్ర'పై పలు దేశాల ఆసక్తి

పాక్‌పై దాడులతో తెలిసిన మన సత్తా

ఫైనల్ స్టేజీలో ఇండోనేషియాతో ఒప్పందం

న్యూఢిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత, భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్తాన్‌పై భారీ దాడులు చేసింది. ఈ దాడుల్లో భారత 'బ్రహ్మోస్' క్షిపణి పాకిస్తాన్ ఎయిర్ బేసుల్ని ధ్వంసం చేసింది. అత్యంత కచ్చితత్వంతో -2 వ పేజీలో...



# గ్రేటర్‌లో ఓఆర్ఆర్ గెట్లు

## జీహెచ్ఎంసీలోకి 27 మున్సిపాలిటీలు

హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టమ్

3 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్తు కొనుగోలు

రాష్ట్రంలో కొత్తగా మూడో డిస్కం ఏర్పాటు

సొంతంగా విద్యుత్తు ఉత్పత్తికి పరిశ్రమలకు అవకాశం

రాష్ట్ర మంత్రివర్గంలో కీలక నిర్ణయాలు




హైదరాబాద్ శివారులోని ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను ఆనుకొని ఉన్న 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

హైదరాబాద్, నవంబర్ 25 (ఈవార్తలు): ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అంతేకాకుండా.. రాష్ట్రంలో మూడో డిస్కం ఏర్పాటుకు కూడా మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. వ్యవసాయ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్ కొత్త డిస్కం పరిధిలోకి రానున్నాయి. అదేవిధంగా 3 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సమావేశానంతరం మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. 'రాబోయే పదేళ్లకు సరిపడే విద్యుత్తు అవసరంపై సుదీర్ఘంగా చర్చించాం. 2 వేల మెగావాట్ల పంప్ స్టోరేజ్ పవర్ కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నాం. విద్యుత్తు వ్యవస్థలో తరువాయి 2 వ పేజీలో...

# పల్లెల్లో పంచాయతీ ఓట్లు



## మోగిన సర్పంచ్ ఎన్నికల నగారా

ఈసీ గెజిట్ నోటిఫికేషన్ రిలీజ్.. 31 జిల్లాల్లో 3 విడతల్లో ఎన్నికలు




డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్

రాష్ట్రంలో మొత్తం 12,728 సర్పంచ్, 1,12,242 వార్డు స్థానాలకు ఎన్నికలు

రేపటి నుంచి తొలి విడత నామినేషన్లు

షెడ్యూల్ విడుదలతోనే అమల్లోకి కోడ్

ఎలక్షన్ కమిషనర్ రాణి కుముదిని వెల్లడి

తెలంగాణ పల్లె పోరుకు రంగం సిద్ధమైంది. పంచాయతీ ఎన్నికలకు ముహూర్తం ఖరారైంది. స్థానిక సంస్థల ఎన్నికలకు నగరా మోగింది. ఎలక్షన్ కమిషన్ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. ఈమేరకు స్టేట్ ఎలక్షన్ కమిషన్ చీఫ్ రాణి కుముదిని ఎన్నికల షెడ్యూల్ వివరాలు వెల్లడించారు. మొత్తం మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.

హైదరాబాద్, నవంబర్ 25 (ఈవార్తలు): రాష్ట్రంలోని 12,728 సర్పంచ్ స్థానాలు, 1,12,242 వార్డులకు డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్.. అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. గురువారం నుంచి తొలి విడత నామినేషన్లు స్వీకరించనున్నారు. షెడ్యూల్ విడుదలతోనే పాటే మంగళవారం నుంచే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని రాణి కుముదిని తెలిపారు.

### షెడ్యూల్ వివరాలివీ..

మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో 12,728 సర్పంచ్, 1,12,242 వార్డు స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్.. పోలింగ్ రోజే మధ్యాహ్నం 2 నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,704 |
| వెండి (గ్రాము): | రూ.174 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,461 |

# రూ.60 వేల సంగతేంది?

చీరలు ఇస్తే సరిపోతదా?.. సీఎం రేవంత్2కు హరీశ్ సవాల్



'ఇందిరమ్మ చీరలు ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోతదా? ఒక్కో మహిళకు ఇవ్వాల్సిన రూ.60 వేల సంగతేంది?' అని సీఎం రేవంత్‌ను మాజీమంత్రి హరీశ్ రావు నిలదీశారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. మహిళా సంఘాల్లో ఉన్నవారికి మాత్రమే చీరలు ఇస్తున్నారని ఆరోపించారు.

హైదరాబాద్, నవంబర్ 25 (ఈవార్తలు): కేవలం చీర ఒకటే ఇచ్చి చేతులు దులుపుకున్నారని.. కానీ ప్రతి మహిళకు రూ. 60 వేలతో పాటు సారె ఇస్తామన్న హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇక వడ్డీలేని రుణాల విషయంలోనూ ప్రభుత్వం మోసం చేస్తోందని.. మహిళా సంఘాలకు ఇచ్చిన రూ. 25 వేల కోట్ల రుణాల్లో.. కేవలం రూ. 5 వేల కోట్లే వడ్డీలేని రుణాలని ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రతి బతుకమ్మ పండుగకు 18 ఏళ్లు నిండిన కోటి 30 వేల మంది మహిళలకు చీరలు అందించారని చెప్పారు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళా సంఘాల్లో ఉన్న దాదాపు 40 లక్షల మందికి మాత్రమే ఉచిత చీరలు పంపిణీ చేస్తోందన్నారు. ఇక సిద్దిపేట జిల్లాలో 3.83 లక్షల మంది మహిళలు ఉంటే.. 1.99 లక్షల మందికి మాత్రమే తరువాయి 2 వ పేజీలో...



# అంబానీని మించేలా రేవంత్


## రూ.4 లక్షల కోట్ల భూ స్కాం!

9,292 ఎకరాలపై సర్కారు కుట్ర.. రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకే దెబ్బతో అదానీ, అంబానీలను దాటిపోవాలని చూస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. పారిశ్రామిక వాడల భూములను విక్రయించి రూ. 4 లక్షల కోట్లకు పైగా భూకుంభకోణానికి పాల్పడాలని చూస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి తమ మునిమనవలు, వారి మునిమనవలు కూడా కూర్చుని తిన్నా తరగని ఆస్తిని వెనుకేసుకోవాలనే దురుద్దేశంతోనే ఈ భూకుంభకోణానికి తెరలేపారని అన్నారు.

హైదరాబాద్, నవంబర్ 25 (ఈవార్తలు): తక్కువ ధరకు 9,292 ఎకరాలను ధారాదత్తం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. ఇదివరకు పరిశ్రమలు, ప్రజల ఉపాధి కోసం ఇచ్చిన భూముల్లో ప్రైవేటు వ్యక్తులు అపార్టుమెంట్లు కడతామంటే ప్రభుత్వం అనుమతిస్తోందని అన్నారు. గత ఐదారు దశాబ్దాలుగా హైదరాబాద్ నగరంలో 21 పారిశ్రామిక వాడలు ఏర్పడ్డాయని ఆయన గుర్తుచేశారు. ప్రజల భూములను తీసుకుని ప్రభుత్వాలు పరిశ్రమలకు ఇచ్చాయని, నగరం విస్తరించడంతో తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



పిల్లల బాల్యాన్ని ఫోన్లు చిదిమేస్తున్నాయని, తీవ్ర ఒత్తిడి, మానసిక కుంగుబాటుకు కారణం అవుతున్నాయి ఆందోళన వ్యక్తం చేసిన డెన్మార్క్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 15 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను బ్యాన్ చేస్తూ ఆ దేశ పార్లమెంట్ బిల్లును పాస్ చేసింది. స్నాప్‌చాట్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి ఏ సోషల్ మీడియా ఫ్లాట్‌ఫామ్స్ వాడకుండా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొంది.

# నన్ను తిట్టినోనికి పదవిస్తవా?



నా కుటుంబంపై కైలాశ్ తిట్లు

వెంటనే తొలగించి వేరే వాళ్లకివ్వాలి

సీఎం రేవంత్‌కు మంత్రి కోమటిరెడ్డి లేఖ

నల్లగొండ, నవంబర్ 25 (ఈవార్తలు): నల్లగొండ జిల్లా కాంగ్రెస్‌లో డీసీసీ పదవి చుట్టూ రాజకీయ ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇటీవల డీసీసీ అధ్యక్షుడిగా నియమితుడైన పున్నా కైలాశ్ నేత నియామకంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో పార్టీ అంతర్గతంగా కలహాలు మొదలయ్యాయి. పున్నా కైలాశ్ తనపై, తన కుటుంబంపై అసభ్య పదజాలంతో మీడియా ముందు మాట్లాడాడని ఆరోపించిన మంత్రి కోమటిరెడ్డి.. అలాంటి వ్యక్తికి డీసీసీ పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. డీసీసీ పదవి నుంచి అతన్ని తొలగించి, అర్హులైన నాయకుడికి ఆ బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఈ తరువాయి 2 వ పేజీలో...




# టీ 20 వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల

టీ20 వరల్డ్ కప్-2026 షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. తొలి మ్యాచ్ ఫిబ్రవరి 7న కొలంబో వేదికగా పాకిస్థాన్-నెదర్లాండ్స్ మధ్య జరగనుంది. అదే రోజున టీమ్ ఇండియా ముంబై వేదికగా అమెరికాతో తలపడనుంది. ఫిబ్రవరి 15న కొలంబోలో భారత్-పాక్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఇండియా, పాకిస్థాన్, యూఎస్ఏ, నెదర్లాండ్స్, నమీబియా ఒకే గ్రూప్ ఉన్నాయి. మార్చి 8న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.


(పూర్తి వివరాలు 'క్రీడావాణి' పేజీలో)

# ఏపీలో కొత్తగా 3 జిల్లాలు

జిల్లాలుగగా మార్కాపురం, మదనపల్లె, పోలవరం.. 29కి చేరనున్న మొత్తం జిల్లాల సంఖ్య

కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లు, ఒక మండలం..

మంత్రుల కమిటీ సిఫార్సులకు చంద్రబాబు ఓకే



అమరావతి, నవంబర్ 25 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలనా సౌలభ్యాన్ని మరింత మెరుగుపరిచే దిశగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు ఆయన ఆమోదముద్ర వేశారు. మంత్రుల కమిటీ సమర్పించిన నివేదికపై రెండు రోజుల పాటు సమీక్ష నిర్వహించిన చంద్రబాబు, కొన్ని మార్పులతో ఈ ప్రతిపాదనలను అంగీకరించారు. దీంతో రాష్ట్రంలోని మొత్తం జిల్లాల సంఖ్య 26 నుంచి 29కి చేరనుంది. కొత్తగా మార్కాపురం, మదనపల్లె, పోలవరం జిల్లాలు ఏర్పడనున్నాయి. పోలవరం జిల్లాకు రంపచోడవరం కేంద్రంగా ఉండనుంది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయని, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

26.11.2025

మేషం: వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో కొన్ని ఇబ్బందులు తప్పవు ముఖ్యమైన వ్యవహారాల్లో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. రుణదాతల నుండి ఒత్తిడి అధికమవుతుంది.

వృషభం: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. చిన్ననాటి మిత్రుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. వ్యాపారాలు విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. ఆప్తుల ఉండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మిధునం: అధికారులు అనుగ్రహంతో పదోన్నతుల పెరుగుతాయి. కొన్ని వ్యవహారాలలో సన్నిహితుల వృత్తి వ్యాపారాల్లో ఆశించిన లాభాలు అందుతాయి. నిరుద్యోగుల కలలు సాకారం అవుతాయి. సహాయసహకారాలతో ముందుకు సాగుతారు. చేపట్టిన పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి కీలక సమాచారం అందుతుంది.

కర్కాటకం: ఉద్యోగాలలో అదనపు పనిభారం ఉంటుంది. నూతన ప్రయత్నాలు చేస్తారు. దూరపు బంధువుల ఆగమనం కొంత ఆనందం కలిగిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. దూర ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడి పెరుగుతుంది.

సింహం: వ్యాపార ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. వ్యయ ప్రయాసలతో గాని పనులు పూర్తి కావు. చేపట్టిన పనులు వాయిదా పడతాయి. సంతానం విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది. కుటుంబ సభ్యులతో చిన్నపాటి విభేదాలు ఉంటాయి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది.

కన్య: ఉద్యోగాలలో మరింత అనుకూల పరిస్థితులు ఉంటాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు గౌరవ మర్యాదలకు లోటుండదు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

తుల: ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రుల నుంచి శుభవార్తలు అందుతాయి. బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. అధికారులతో చర్చలు సఫలం అవుతాయి.

వృశ్చికం: బంధుమిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. చేపట్టిన పనుల్లో ప్రతిబంధకాలు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపార, ఉద్యోగాలలో కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వ్యాపారాలకు పెట్టుబడులు పెట్టే విషయంలో పునరాలోచన చేయడం మంచిది.

ధనస్సు: మాతృ వర్గ బంధువుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తి కావు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో సహెూద్యోగులతో మాటపట్టింపులు ఉంటాయి. ఇంటాబయట ఊహించని సమస్యలు చోటుచేసుకుంటాయి. వాహన ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం.

మకరం: సోదరుల నుండి ధన సహాయం అందుతుంది. నూతన మిత్రులు పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. శుభకార్యాలకు ధనవ్యయం చేస్తారు. భాగస్వామి వ్యాపారాలలో పురోగతి సాధిస్తారు. ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. సంతానం పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు.

కుంభం: వృత్తి ఉద్యోగాలలో ఇతరుల నుండి విమర్శలు అధికమవుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. చేపట్టిన వ్యవహారాలు మందగిస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వాయిదా వేస్తారు. ఆర్థిక ఇబ్బందులు వలన నూతన రుణయత్నాలు చేస్తారు. దూరప్రయాణ సూచనలు ఉన్నవి.

మీనం: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. కీలక సమయంలో సన్నిహితుల స్నేహితుల సలహాలు కలిసివస్తాయి. విలువైన వస్త్రాలు ఆభరణాలు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. ఆప్తుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

# రామమందిరంపై కాషాయ రెపరెపలు

### అయోధ్యలో అట్టహాసంగా ధ్వజారోహణ.. ప్రధాని మోదీ చేతుల మీదుగా కార్యక్రమం.. భూగోళం మొత్తం రాముని భక్తిలోనే: మోదీ

అయోధ్య: అయోధ్యలో రామమందిర నిర్మాణం పనులు ముగిశాయి. దీనికి సంకేతంగా అయోధ్యంలో ధ్వజారోహణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ చారిత్రక వేడుక కోసం 100 టన్నుల పుష్పాలతో సర్వాంగ సుందరంగా ఆలయం, పరిసరాలను అలంకరించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ధ్వజారోహణం ఎగురువేశారు. సరిగ్గా అభిజిత్ లగ్నంలో ఈ వేడుక జరిగింది. మొత్తం 7 వేల మంది అతిథులు ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోఅయోధ్యలోని రామమందిరంలో మంగళవారం అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. అంగరంగ వైభవంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. రామ్‌లల్లా గర్భగుడిపై ధర్మ ధ్వజాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. అభిజిత్ లగ్నంలో సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు కాషాయ జెండాను మోదీ ఎగురవేశారు. దీనికి ముందు గర్భగుడిలోని బాలరాముడికి ప్రధాని మోదీ హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కాషాయ రంగులో 22 అడుగుల పొడవు, 11 అడుగుల వెడల్పుతో లంబకోణ త్రిభుజాకారంలో ఉన్న ఈ ధ్వజంపై రాముడి తేజస్సు, శౌర్యాన్ని సూచించేలా సూర్యుడు, కోవిదార చెట్టు, ఓంకారం చిహ్నాలను బంగారు దారంతో ఎంబ్రాయిడరీ చేయించారు. ఐక్యత, సాంస్కృతిక వారసత్వం, రామరాజ్య ఆదర్శాలను ఇది ప్రతిబింబిస్తుంది. వాల్మీకి విరచిత రామాయణం ప్రకారం.. మందార, పారిజాత మొక్కలను కశ్యప మహర్షి అంటుకట్టడం ద్వారా ఈ కోవిదార చెట్టు ఆవిర్భవించినట్లు చెబుతారు. ప్రాచీన కాలంలోనే మొక్కల అంటుకట్టే విధానం ఉందనేది దీన్ని బట్టి తెలుస్తోంది. మార్గశిర పంచమిని వివాహ పంచమిగా పిలుస్తారు. ఈ తిథినాడే సీతారాముల కళ్యాణం జరిగిందని, అభిజిత్ లగ్నంలో శ్రీరాముడు కౌసల్య గర్భాన జన్మించినట్టు పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ విశిష్టమైన రోజున అదే అభిజిత్ లగ్నంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. అహ్మదాబాద్‌లోని పారాచ్యూట్ తయారీ సంస్థ ఈ ధ్వజాన్ని తయారుచేసింది. చాలాకాలం పాటు మన్నేలా పారాచ్యూట్ గ్రేడ్ వస్త్రం, పట్టుదారాలతో 25 రోజుల పాటు శ్రమించి తయారుచేశారు. ధ్వజారోహణం అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం భారతీయ డీఎన్‌ఏలోనే ఉందని అన్నారు. అంతేకాదు, అయోధ్యలో భవ్యమైన రామమందిర నిర్మించాలనే హిందువుల 500 ఏళ్ల నాటి కల నెరవేరిందని పేర్కొన్నారు. "అయోధ్య తన చరిత్రలో మరో యుగ ఘట్టాన్ని చూస్తోంది.. దేశంతో పాటు భూగోళం మొత్తం రాముని భక్తిలో మునిగిపోయింది" అని వ్యాఖ్యానించారు. ప్రముఖ స్వామీజీ గణేశ్వర్ శాస్త్రి ఆధ్వర్యంలో అయోధ్య, కాశీ, దక్షిణ భారతదేశానికి చెందిన 100 మంది పండితులు చేతులు మీదుగా ఈ కార్యక్రమం సాగింది.



## అంబానీని మించేలా రేవంత్

మొదటి పేజీ తరువాయి

పరిశ్రమలు నగరం మధ్యలోకి వచ్చాయని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాలుష్యం లేని పరిశ్రమలు లేదా కంపెనీల ఏర్పాటుకు గ్రిడ్ పాలసీని తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న భూదందాపై విద్యార్థి నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పారిశ్రామిక వాడల భూములను విక్రయించి రూ.4 లక్షల కోట్లకు పైగా కుంభకోణం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. 9,292 ఎకరాల భూమిని ధారాదత్తం చేసేందుకు రేవంత్ రెడ్డి సోదరులు, అనుయాయులు ఒప్పందాలు చేసుకున్నారని ఆయన మండిపడ్డారు.తెలంగాణ వనరులను కాపాడుకునే బాధ్యత తెలంగాణ ప్రజలదేనని, ముఖ్యంగా విద్యార్థులు ఈ దిశగా దృష్టి సారించాలని అన్నారు. విద్య, ఉపాధి, కాంట్రాక్టులు, రాజకీయాల్లో 42 శాతం కోటా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ముస్లింలందరికి న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. తెలంగాణపై బీఆర్ఎస్ పార్టీకి ఉన్న ప్రేమ ఏ పార్టీకి ఉండదని అన్నారు. తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన ఉద్ఘాటించారు.

## రూ.60 వేల సంగతేంది?

మొదటి పేజీ తరువాయి

చీరలు పంచుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామి ఇచ్చినట్లు.. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు ఇవ్వాల్సిన రూ. 60 వేలు ఇచ్చి సారె పెట్టాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కాగా, మహిళా సంఘాలు రూ. 25 వేల కోట్ల రుణాలు తీసుకుంటే.. అందులో రూ. 5 వేల కోట్లు మాత్రమే వడ్డీలేని రుణం వస్తోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 20 పైసలు ఇస్తూ 80 పైసలు ఎగ్గొడుతోందని ఆరోపణలు గుప్పించారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన ప్రకారం రూ. 25 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా పట్టణ ప్రాంత మహిళలకు అటు చీర లేదు.. ఇట వడ్డీలేని రుణాలు లేవని మండిపడ్డారు. ప్రతి పండగ సమయంలో కేసీఆర్ సంక్షేమ పథకాలు ఇస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం ఓట్లు వచ్చినప్పుడల్లా పథకాలు ఇస్తున్నారంటూ ఎద్దేవా చేశారు.

## ఎన్నికల నగారా

మొదటి పేజీ తరువాయి

ఫలితాలు ప్రకటించనున్నారు. రేపటి నుంచి తొలి విడత నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడత ఎన్నికలకు ఈనెల 30 నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. తొలి విడతలో 4,236 సర్పంచ్ స్థానాలకు 37,440 వార్డులకు పోలింగ్ జరగనుంది. రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలకు 38,350 వార్డులకు, మూడో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలకు 38,350 వార్డులకు పోలింగ్ చేపట్టనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు అనుమతినివ్వగా పంచాయతీ రాజ్‌శాఖ, ఎన్నికల సంఘం ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేశాయి.

## ప్రపంచం మెచ్చిన బ్రహ్మోస్ క్షిపణులు

మొదటి పేజీ తరువాయి

బ్రహ్మోస్ చేసిన దాడులకు పాకిస్థాన్ వద్ద సమాధానమే లేకుండా పోయింది. దీంతో ఒక్కసారిగా బ్రహ్మోస్ సత్తా ప్రపంచానికి తెలిసింది. ప్రపంచంలోని చాలా దేశాలు ఈ సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్‌ను కొనుగోలు చేయడానికి ఉవ్విళ్లూరుతున్నాయి. భారత్ ఏకంగా 450 మిలియన్ డాలర్ల ఆర్డర్లను ఖరారు చేయడానికి సిద్ధమైంది. ఇది భారత రక్షణ ఎగుమతుల సామర్థ్యాన్ని పెంచుతుంది. ఇప్పటికే, ఇండోనేషియాతో బ్రహ్మోస్ డీల్ దాదాపుగా ఖరారైంది. రష్యా తుది ఆమోదం కోసం భారత్ వేచిచూస్తోంది. బ్రహ్మోస్ భారత్-రష్యాల ఉమ్మడి ప్రాజెక్ట్. డీఆర్డీవో, రష్యాకు చెందిన ఎన్‌పీవో మాషినోస్ట్రోయెనియా సంయుక్తంగా అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్సోనిక్ క్రూయిజ్ క్షిపణులలో ఒకటి. అత్యంత ఖచ్చితత్వంతో దాడులు చేయడం దీని ప్రత్యేకత. నింగి, నేల, నీరు నుంచి ఈ క్షిపణిని ప్రయోగించవచ్చు. ఇటీవల, దుబాయ్ ఎయిర్ షోలో బ్రహ్మోస్ క్షిపణి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## ఏపీలో కొత్తగా 3 జిల్లాలు

మొదటి పేజీ తరువాయి

వేగవంతం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాలతో పాటు, రెవెన్యూ వ్యవస్థలోనూ కీలక మార్పులు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు కూడా సీఎం అంగీకరించారు. అదేవిధంగా, కర్నూలు జిల్లాలోని ఆదోని మండలాన్ని విభజించి, పెద్దహరివనాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేసేందుకు కూడా అనుమతి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంత్రుల కమిటీ ఈ సిఫార్సులు చేసింది. త్వరలోనే ఈ కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించిన అధికారిక ప్రక్రియను ప్రారంభించి, కార్యాలయాలు, అధికారుల నియామకంపై దృష్టి సారించనున్నారు.

కొత్త రెవెన్యూ డివిజన్లు ఇవే:

- నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)
- అద్దంకి (ప్రకాశం జిల్లా)
- పీలేరు (మదనపల్లె జిల్లా)
- బనగానపల్లె (నంద్యాల జిల్లా)
- మడకశిర (సత్యసాయి జిల్లా)

## నన్ను తిట్టినోనికి పదవిస్తవా?

మొదటి పేజీ తరువాయి

మేరకు సీఎం రేవంత్‌కు కోమటిరెడ్డి లేఖ రాసినట్లు సోషల్ మీడియాలో ఒక ప్రతి వైరల్ అవుతోంది. అటు.. కాంగ్రెస్‌లోని బీసీ వర్గాలు కోమటిరెడ్డి వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఒక బీసీ నాయకుడు జిల్లా అధ్యక్షుడిగా ఎదగడాన్ని కోమటిరెడ్డి సహించలేకపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.



సీఎంపై గతంలో తీవ్ర వ్యాఖ్యలు చేసిన కోమటిరెడ్డి తమ్ముడిని ముందుగా ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని బీసీ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. గతంలో సీఎం సన్నిహితుడు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విషయంలోనూ కోమటిరెడ్డి బ్రదర్స్ కక్ష గట్టారని ఆరోపిస్తున్నారు. అగ్రకుల అహంభావంతో వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఈ వివాదం ఇప్పుడు నల్లగొండ కాంగ్రెస్‌లో పెద్ద రాజకీయ చర్చగా మారింది.

# గ్రేటర్‌లో ఓఆర్ఆర్ గెట్లు

మొదటి పేజీ తరువాయి

పారదర్శకత కోసమే కొత్త డిస్కం ఏర్పాటు చేస్తున్నాం' అని తెలిపారు.

### కేబినెట్ నిర్ణయాలివే..

- హైదరాబాద్ తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నీ జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్ లోపల, బయట, ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న 27 అర్బన్ లోకల్ బాడీస్ (మున్సిపాలిటీ, కార్పొరేషన్లను) జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.
- రాష్ట్రంలో ఇప్పుడున్న ఎస్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ రెండు డిస్కమ్‌లతో పాటు కొత్తగా మూడో డిస్కమ్ ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వ్యవసాయ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్, మిషన్ భగీరథ, సురక్షిత మంచి నీటి పథకాలు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ సీవరేజ్ బోర్డ్ పవర్ కనెక్షన్లన్నీ కొత్త డిస్కమ్ పరిధిలోకి వస్తాయి.
- రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, రాబోయే పదేళ్లకు అవసరమయ్యే విద్యుత్తు సరఫరా, విద్యుత్తు ఉత్పత్తి అంచనాపై కేబినెట్ సమగ్రంగా చర్చించింది. విద్యుత్ విభాగం అధికారులు సమగ్రంగా సమర్పించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను పరిశీలించింది. పునరుత్పాదక విద్యుత్తు వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నిబంధనల ప్రకారం.. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా 3000 మెగా వాట్ల సోలార్ పవర్ కొనుగోలుకు వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది. ఐదేళ్ల పాటు విద్యుత్ సరఫరా చేసే కాల పరిమితి ఒప్పందాలతో ఈ టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయించింది.
- సోలార్ పవర్ తరహాలోనే పంప్డ్ స్టోరేజ్ పవర్ వినియోగం పెంచే ఉద్దేశంతో 2000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది. ఐదేళ్ల కాల పరిమితితోనే ఈ టెండర్లు కూడా పిలవాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయి. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకొచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే డిస్కమ్‌ల వద్ద ఉన్న ఎంవోయూలను కూడా పరిశీలించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 10 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి ప్రదర్శించే కంపెనీలకు ప్రభుత్వమే అవసరమైన భూమిని కేటాయించి, నీళ్లను అందిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ముందుగా మన డిస్కమ్‌లకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది.
- రాష్ట్రానికి వచ్చే కొత్త పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా రాష్ట్ర మంత్రివర్గం మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది. కొత్తగా స్థాపించే పరిశ్రమలు తమకు అవసరమైన విద్యుత్తును తమతంట తామే సొంతంగా ఉత్పత్తి చేసుకునేందుకు అవకాశం కల్పించింది. కొత్త పరిశ్రమలు క్యాప్టివ్ పవర్ జనరేషన్‌కు అప్లై చేసుకుంటే వెంటనే అనుమతి ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యానికి ఎలాంటి గరిష్ఠ పరిమితి లేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలకు ఇప్పుడున్న విధానంలోనే విద్యుత్ సరఫరా జరుగుతుంది.
- రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌లో కొత్తగా నిర్మించే 800 మెగావాట్ల ప్లాంట్‌ను ఎన్టీపీసీ అధ్వర్యంలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. పాల్వంచ, మక్తల్ లోనూ ఎన్టీపీసీ అధ్వర్యంలో విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించింది. ఎన్టీపీసీకి ఈ యూనిట్ నిర్మాణం అప్పగిస్తే ఎంత విద్యుత్ యూనిట్ రేట్ పడుతుంది.. జెన్ కో ద్వారా చేపడితే ఎంత రేట్ పడుతుందో.. ముందుగా అంచనాలు వేసుకుని తుది పరిశీలన చేయాలని కేబినెట్ నిర్ణయించింది.
- హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే బెంగుళూరులో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టమ్ ఉంది. ఇటీవలే అక్కడ అమలు చేసిన విధానాన్ని అధికారులు అధ్యయనం చేసి వచ్చారు. అక్కడ అమలు చేసిన విధానం ప్రకారం జీహెచ్ఎంసీ పరిధిలో అండర్ గ్రౌండ్ కేబుల్ సిస్టమ్ ఏర్పాటుకు దాదాపు రూ. 14,725 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. హైదరాబాద్ సిటీని విద్యుత్ సర్కిళ్ల వారీగా మూడు విభాగాలుగా విభజించి.. ఈ ప్రాజెక్ట్ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. విద్యుత్‌తో పాటు టీ ఫైబర్, వివిధ కేబుల్ నెట్‌వర్క్ వైర్లన్నీ అండర్ గ్రౌండ్‌లోనే ఉండేలా చేయాలని, ఆ కంపెనీలతో సంప్రదింపులు జరపాలని నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించి వర్కింగ్ ప్లాన్ రెడీ చేయాలని అధికారులను ఆదేశించింది.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్ద నల్లబెల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ బీసీ యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి 20.28 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ములుగు జిల్లా ములుగు మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో స్పోర్ట్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు 40 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.
- జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కొత్తగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇప్పుడున్న 56 ఏటీసీలతో పాటు కొత్తగా 6 ఐటీఐలలో ఏటీసీలను ఏర్పాటు చేయాలని నిర్ణయం.

### జీహెచ్ఎంసీలో కలవబోయే మున్సిపాలిటీలు

పెద్ద అంబర్ పేట్, జల్‌పల్లి, తుర్కయంజాల్, శంషాబాద్‌లు, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, దమ్మాయి గూడ, తుక్కుగూడ, మేడ్చల్, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, కొంపల్లి, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జీగీర్, మీర్‌పేట్, తెల్లాపూర్, ఫిర్జాదిగూడ, జవహర్ నగర్, బోడుప్పల్, నిజాంపేట్, దుండిగల్, బొల్లారం.

## లీకు వీరులున్నారు.. నిజమే!

తెలంగాణలో ప్రభుత్వ నిర్ణయాలు, కేబినెట్‌లో జరిగిన చర్చల సారాంశం మొత్తం ప్రతిపక్ష నేతలకు చేరవేస్తున్న లీకు వీరుల విషయంపై శ్రీధర్ బాబు స్పందించారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ ఈ లీకుల విషయం మీడియా ద్వారా తమ దృష్టికి వచ్చిందని కేబినెట్ నిర్ణయాలు, ప్రభుత్వ నిర్ణయాల లీక్‌లపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో కేబినెట్ సైతం ఇదే ఆలోచనతో ఉందన్నారు. కేబినెట్ నిర్ణయాలు చాలా కాన్ఫిడెన్షియల్ అని, అలాంటిది ఇంకా జీవోలు రాకముందే వాటి సారాంశం ఇతరులకు చేరవేడం అంటే అలాంటి ఘటనలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

# ప్రతి డివిజన్‌కు రూ.2 కోట్లు

**జీహెచ్ఎంసీ కార్పొరేటర్లకు గుడ్ న్యూస్**

హైదరాబాద్, నవంబర్ 25 (ఈవార్తలు): హైదరాబాద్ లోని వివిధ డివిజన్లలో అభివృద్ధి పనుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు శుభవార్త చెప్పారు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీ. మంగళవారం జరిగిన జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్ లో కీలక ప్రకటన చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతీ డివిజన్ కు 2 కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. డివిజన్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల కోసం నిధుల కేటాయించారు. మొత్తం 150 డివిజన్ల కు గాను 300 కోట్ల రూపాయలు కేటాయించినట్లు కౌన్సిల్ మీటింగ్ లో తెలిపారు. మరోవైపు మేయర్ గద్వాల విజయలక్ష్మీ అధ్యక్షతన చివరి కౌన్సిల్ సమావేశం కావడంతో కౌన్సిల్ చివరి సమావేశం సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుత పాలకవర్గం పూర్తి పదవీకాలానికి ముగింపు దశలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నగర అభివృద్ధికి సరికొత్త దశ,దిశ నిర్దేశించాం. హైదరాబాద్ అభివృద్ధి పట్ల అందరం కలిసి పనిచేసిన ప్రతి క్షణం నాకు చిరస్మరణీయం. ఈ బాధ్యతను నాపై ఉంచిన ప్రజలకు, రాష్ట్ర ప్రభుత్వానికి..నాతో కలిసి నడిచిన మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. దాదాపు ఈ 5 ఏండ్లలో నగరంలో రోడ్లు, డ్రైనేజ్, ఫ్లైవర్లు, జంక్షన్ ఇంప్రూవ్మెంట్ వంటి ప్రాథమిక సదుపాయాల మరింత




విస్తరించా అని చెప్పారు. అదే విధంగా థీమ్ పార్కులు, అర్బన్ ఫారెస్ట్ ల ద్వారా పచ్చదనం పెంపునకు ప్రత్యేక కృషి చేశాం. పేద, మధ్య తరగతి ప్రజలు, నిరుద్యోగులు, చిరుద్యోగులకు 5 రూపాయల బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నాం. చివరి సమావేశం కావడంతో టీ బ్రేక్ లో కార్పొరేటర్లతో ఫోటో సెషన్ ఉంటుందని మేయర్ అన్నారు. 2026 ఫిబ్రవరి 11తో కౌన్సిల్ గడువు ముగియనుంది. కార్పోరేటర్లు, సిటీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, బీజేపీ కార్పొరేటర్లు హాజరయ్యారు. కొత్తగా ఎన్నికైన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కూడా సమావేశానికి హాజరయ్యారు. 95 ప్రశ్నలు, 45 ఎజెండా అంశాలపై చర్చించారు.

### వందేమాతరం గీతానికి అవమానం

జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్ ఉద్రిక్తంగా మారింది. ఎంఐఎం, బీజేపీ సభ్యుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. బీజేపీ, ఎంఐఎం సభ్యులు కుర్చీలపైకి ఎక్కి ఆందోళన చేశారు. మేయర్ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్షల్‌తో బయటకు పంపుతానని అనడంతో గొడవవ సర్దుమణిగింది. కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది.. 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వందేమాతర గీతం ఆలాపనకు అవకాశం ఇవ్వాలని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు కోరారు.. మేయర్ అంగీకారం తెలిపి.. అందెశ్రీకి నివాళికి చిహ్నంగా జయజయహే తెలంగాణ కూడా పాడుదాం అని కోరారు.. అయితే దీన్ని ఎంఐఎం తీవ్రంగా వ్యతిరేకించింది. అనంతనం.. సభలో వందేమాతరం గీతాలాపన కొనసాగింది. చెత్త బజార్ డివిజన్ కార్పొరేటర్ సోహెల్ వందేమాతరం గీతాలాపన సమయంలో నిలబడకుండా నిరసన తెలిపారు.. వందేమాతరం, జయ జయహే తెలంగాణ గీతాలాపన సమయంలో ఎంఐఎం కార్పొరేటర్లు కొందరు నిలబడకుండా నిరసన తెలుపుతూ కౌన్సిల్‌లో కూర్చుండిపోయారు. దీనిపై బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరు పార్టీల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని తీవ్ర స్థాయికి చేరుకుంది. కౌన్సిల్‌లో వీళ్ల గలాటా కొనసాగుతుండగా.. మార్షల్ లోపలికి చేరుకున్నారు.. మనమేమైన రౌడీలమా? అంటూ మేయర్ విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్ర వాగ్వాదం మధ్య జీహెచ్ఎంసీ కౌన్సిల్ వాయిదా పడింది



## బీజేపీ సర్పంచ్‌ను గెలిపిస్తే 10 లక్షలు

**కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆఫర్**

కరీంనగర్, నవంబర్ 25 (ఈవార్తలు): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మంగళవారం కీలక ప్రకటన చేశారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో బీజేపీ మద్దతు ఉన్న సర్పంచ్ అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటే, ఆ గ్రామానికి తక్షణమే రూ.10 లక్షల అభివృద్ధి నిధులు అందిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన వెంటనే బండి సంజయ్ ఈ ఆఫర్ ప్రకటించడం గమనార్హం. "మీ గ్రామంలో బీజేపీ బలపరిచిన సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే, ఎలాంటి జాప్యం లేకుండా, సాకులు చెప్పకుండా ఆ గ్రామానికి నేరుగా రూ.10 లక్షల నిధులు మంజూరు చేస్తా" అని బండి సంజయ్ 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. ఒక పార్లమెంట్ సభ్యుడిగా తన వద్ద ఎంపీ నిధులు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటికే సీఎస్ఆర్ నిధుల ద్వారా కోట్లాది రూపాయలు తీసుకొచ్చి విద్య, వైద్య రంగాల్లో ఖర్చు చేశామని గుర్తుచేశారు. కేంద్ర మంత్రిగా మరిన్ని నిధులు తెచ్చి పంచాయతీల అభివృద్ధికి పాటుపడతానని ఆయన వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వాలపై బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఏకగ్రీవ పంచాయతీలకు రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిందని, ఆ మాటలు నమ్మి కరీంనగర్ పరిధిలో 70 గ్రామాలు బీఆర్ఎస్ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయని అన్నారు. ఐదేళ్లు గడిచినా కేసీఆర్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ కూడా ఇలాంటి హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని, ఆ రెండు పార్టీల మాటలు నమ్మవద్దని ప్రజలను కోరారు. పొరపాటున కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ మద్దతుదారులు గెలిస్తే కొత్త నిధులు రావని, కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా పక్కదారి పట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# మరోసారి పోలీస్ కస్టడీకి ఐ-బొమ్మ రవి!

**నాంపల్లి కోర్టులో సైబర్ క్రైమ్ పోలీసుల పిటిషన్.. నేడు తీర్పు వెలువరించనున్న కోర్టు**

నాంపల్లి/హైదరాబాద్, నవంబర్ 25 (ఈవార్తలు): పైరసీ వెబ్‌సైట్ ఐ-బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవిని మరోసారి కస్టడీకి తీసుకోవడానికి హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అతనిని అరెస్టు చేసిన అనంతరం పోలీసులు వారం రోజుల కస్టడీ కోరుతూ పిటిషన్ దాఖలు చేయగా, న్యాయస్థానం ఐదు రోజుల కస్టడీకి అనుమతించింది. దీంతో ఐదు రోజుల పాటు రవిని కస్టడీకి తీసుకుని పోలీసులు విచారించారు. అతని నుంచి కీలక వివరాలు రాబట్టారు. రవి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు మరోసారి కస్టడీకి తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ క్రమంలో నాంపల్లి కోర్టులో ఏడు రోజుల కస్టడీ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. పోలీస్ కస్టడీపై కోర్టు రేపు తీర్పును వెలువరించనుంది. ఐదు రోజుల పాటు అతడిని విచారించిన పోలీసులు పలు విషయాలను మీడియాకు వెల్లడించారు. ఐ-బొమ్మ రవి అతి విశ్వాసంతో ఉన్నాడని, ఒంటరిగా ఉంటూ, వారానికో దేశం తిరిగేవాడని విచారణలో గుర్తించినట్లు పోలీసులు




తెలిపారు. ఈజీ మనీకి అలవాటు పడ్డాడని, లక్ష డాలర్లు వెచ్చించి కరేబియన్ దీవుల పౌరసత్వం కొనుగోలు చేశాడని వెల్లడించారు.

### భార్య కాదు.. మేమే పట్టుకున్నాం

భార్య ఇచ్చిన సమాచారంతోనే ఐ-బొమ్మ రవి పట్టుబడ్డాడనే ప్రచారంలో వాస్తవం లేదని, ఆమెను పోలీసులు విచారించనే లేదని సైబర్ క్రైమ్ అడిషనల్ సీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఐ-బొమ్మ రవి కేసు వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. కస్టడీలో రవి నుంచి కీలక విషయాలు రాబట్టామని తెలిపారు. ఐ-బొమ్మ వెబ్‌సైట్‌ను రవి మరో కంపెనీ నుంచి హోస్ట్ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. డొమైన్‌ను ఓ వెబ్ హోస్టింగ్ కంపెనీలో రిజిస్టర్ చేశాడని, కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా రవి సినిమాలు పోస్టు చేసేవాడని తెలిపారు. ఐ-బొమ్మ, బప్పం వెబ్‌సైట్ల ద్వారా రవి సినిమాలను పోస్టు చేసేవాడని, ఆయా వెబ్ సాఫ్ట్‌వేర్‌లలో రీడైరెక్ట్ స్క్రిప్ట్ రాశాడని వెల్లడించారు. దీని ద్వారా గేమింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్లకు మళ్లించేవాడని అన్నారు. మూవీరూల్జ్ వంటి పైరసీ వెబ్‌సైట్లు ఇంకా నడుస్తున్నాయని ఆయన తెలిపారు. భవిష్యత్తులో వెబ్-3 సాంకేతికత రానుందని, దాని ద్వారా పైరసీ చేస్తే పట్టుకోవడం కష్టమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఐ-బొమ్మ రవి అతి విశ్వాసంతో ఉన్నాడని, పైరసీ వ్యవహారాల దర్యాప్తు సంక్లిష్టంగా ఉంటుందని అన్నారు. ఐ-బొమ్మ రవి ఒంటరిగా ఉంటూ, వారానికో దేశం చొప్పున తిరిగేవాడని, ఈజీ మనీకి అలవాటు పడ్డాడని, లక్ష డాలర్లు వెచ్చించి కరేబియన్ దీవుల పౌరసత్వం కూడా కొనుగోలు చేశాడని తెలిపారు. మూవీరూల్జ్, తమిళ్‌ఎంవీ లాంటి పైరసీ వెబ్‌సైట్లు నిర్వాహకులను పట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు.

# డ్యూటీలో మతపరమైన దీక్షలు కుదరవు

**సెలవు తీసుకోవాల్సిందే: పోలీసు శాఖ**

**నిబంధనలు ఉల్లంఘించిన కంచన్‌బాగ్ ఎస్సైకి మెమో**

హైదరాబాద్, నవంబర్ 25 (ఈవార్తలు): తెలంగాణ పోలీసు శాఖ తమ సిబ్బంది మతపరమైన దీక్షలు చేపట్టడంపై కీలక, కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. అయ్యప్ప దీక్ష వంటి మతపరమైన దీక్షల్లో ఉన్నవారు విధి నిర్వహణకు హాజరుకాకూడదని, తప్పనిసరిగా సెలవు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ నిబంధనలను ఉల్లంఘించి డ్యూటీలో దీక్షా వస్త్రాలతో కనిపించినందుకు సౌత్ ఈస్ట్ జోన్‌కు చెందిన కంచన్‌బాగ్ ఎస్సై కృష్ణకాంత్‌కు ఉన్నతాధికారులు మెమో జారీ చేశారు. ప్రస్తుతం అయ్యప్ప దీక్షల సీజన్ కావడంతో కానిస్టేబుళ్ల నుంచి ఉన్నతాధికారుల వరకు చాలామంది సిబ్బంది మాల ధరించారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ ఈ కొత్త మార్గదర్శకాలను విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు యూనిఫామ్ లేకుండా నల్ల దుస్తులు, నల్ల




కండువాలు ధరించడం, షూస్ లేకుండా తిరగడం వంటివి చేయరాదని హెడ్ ఆఫీస్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అలాగే, పోలీసులు విధుల్లో ఉన్నప్పుడు జుట్టు, గడ్డం పెంచుకోవద్దని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, మతపరమైన దీక్షలను శాఖ వ్యతిరేకించడం లేదని, క్రమశిక్షణకే ప్రాధాన్యత ఇస్తున్నామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. దీక్ష చేపట్టాలనుకునే వారు ముందస్తుగా అనుమతి తీసుకుంటే రెండు నెలల వరకు సెలవులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దీక్షలో ఉంటూ విధులకు హాజరుకావడం మాత్రం నిబంధనలకు విరుద్ధమని తేల్చిచెప్పారు.

### మండిపడిన రాజాసింగ్

అయ్యప్ప మాల ధరించిన ఎస్సైకి మెమో జారీ చేయడంపై గోషామహల్ శాసనసభ్యుడు రాజాసింగ్ తీవ్రంగా స్పందించారు. పోలీసు శాఖపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అయ్యప్ప దీక్ష సమయంలోనే పోలీసులకు నియమ నిబంధనలు గుర్తుకు వస్తాయా అని ప్రశ్నించారు. ముస్లిం పోలీసులకు ఇచ్చిన స్వేచ్ఛ హిందూ పోలీసులకు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. ఈ మేరకు ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. పోలీసుల జారీ చేసిన ఆదేశాలు కేవలం హిందువులకే వర్తిస్తాయా? ముస్లింలకు కూడా వర్తిస్తాయా? అని ఆయన నిలదీశారు. రంజాన్ సమయంలో లేని నిబంధనలు, అయ్యప్ప మాలధారణ సమయంలోనే ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. హిందువుల పండుగలు వచ్చినప్పుడు, హిందువులు మాలలు ధరించినప్పుడు ఇలాంటి ఆదేశాలు ఎందుకు వస్తున్నాయని ఆయన అడిగారు.

# ప్రజలను దోచుకునేదంతా ఆంధ్రా నిర్మాతలే

**నా దృష్టిలో ఐబొమ్మ రవి రాబిన్ హుడ్**

**జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**

జడ్చర్ల, నవంబర్ 25 (ఈవార్తలు): వెయి కోట్ల రూపాయలు పెట్టుబడితో సినిమాలు నిర్మించి మూడు వేల కోట్లు సంపాదించాలని కొందరు ఆశిస్తున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. సినిమా నిర్మాతలల్లో 99 శాతం మంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారేనని, అలాంటి వారు తెలంగాణలో ఉండి అధిక సంపాదన కోసం ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ వాసులు ఇలాంటి పనులు చేయరని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలను దోచుకునే వారంతా ఆంధ్రప్రదేశ్ నిర్మాతలేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలు తన వద్దకు వచ్చి చెబుతున్న విషయాలనే తాను చెబుతున్నానని అనిరుధ్ రెడ్డి అన్నారు. సినిమా అనేది ఒక వ్యాపారమని ఆయన పేర్కొన్నారు. టిక్కెట్ ధరలు పెంచితే సినీ కార్మికులకు కూడా 20 శాతం వాటా ఇవ్వాలని ముఖ్యమంత్రి చెప్పిన విషయాన్ని తాను సమర్థిస్తున్నానని ఆయన అన్నారు. ఒక కమిషనర్ తన పక్కన సినిమా వాళ్లను పెట్టుకుని మీడియా సమావేశం నిర్వహించడం ప్రతికూల ప్రచారానికి దారి తీసిందని ఆయన అభిప్రాయపడ్డారు. సినిమాలు నష్టాలు మిగిల్చి రోడ్డున పడ్డ నిర్మాతలు కూడా ఉన్నారని ఆయన గుర్తు చేశారు. అధికారులు ఏ పని చేసినా, దానిని ప్రభుత్వానికే ఆపాదిస్తారని గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. అధికారులు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. ఐ-బొమ్మ రవి వ్యవహారాన్ని న్యాయస్థానాలు చూసుకుంటాయని అనిరుధ్ రెడ్డి తెలిపారు. దొంగతనం చేయడాన్ని ఎవరూ సమర్థించరని, అది తప్పేనని, కానీ ఎవరి వద్ద దొంగతనం చేశారనేది కూడా ఆలోచించాలని ఆయన ఆసక్తికర వ్యాఖ్య చేశారు. రాబిన్ హుడ్ పెద్ద వారి వద్ద దోచుకుని పేదలకు పంచి పెట్టాడని ఆయన గుర్తుచేశారు. ఐ-బొమ్మ రవిని ప్రజలు రాబిన్ హుడ్ అంటున్నారని, తాను కూడా అదే అంటున్నానని ఆయన పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌కు ఓటేసి నన్నడిగితే ఎట్ల?

**నెటిజన్‌కు కేటీఆర్ కౌంటర్**

హైదరాబాద్, నవంబర్ 25 (ఈవార్తలు): ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపుపై ఓ నెటిజన్ చేసిన పోస్టుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికరంగా స్పందించారు. "అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు ఓటు వేశాను, కానీ మీరు ఈ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించాలి" అని కోరిన నెటిజన్‌కు.. "మీరు ఓటు వేసింది కాంగ్రెస్ పార్టీకి అయినప్పుడు, ఈ ప్రశ్నకు సమాధానం కూడా వాళ్లనే అడగాలి కదా?" అంటూ కేటీఆర్ బదులిచ్చారు. పటాన్‌చెరు నుంచి డీఎల్ఎఫ్ వరకు నడిచే మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు ఛార్జీని రూ. 30 నుంచి రూ. 45కు పెంచారని, ఇది తమ



లాంటి రోజువారీ ప్రయాణికులకు భారంగా మారిందని ఓ నెటిజన్ ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి, ప్రభుత్వ తీరును నిలదీయాలని కేటీఆర్‌ను ట్యాగ్ చేస్తూ కోరాడు. తాను అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌కు ఓటు వేశానని, కానీ ఇంత భారీగా ఛార్జీలు పెంచడం సరికాదని ఆ పోస్టులో పేర్కొన్నాడు. ఈ పోస్టుపై స్పందించిన కేటీఆర్, "మీరు చెప్పినట్టు నిజంగా కాంగ్రెస్‌కే ఓటేసి ఉంటే, ఈ ప్రశ్నకు సమాధానం కూడా కాంగ్రెస్ పార్టీనే అడగాలి కదా?" అని వ్యాఖ్యానించారు. అయినప్పటికీ, ప్రజా సమస్య కాబట్టి బస్సు ఛార్జీల పెంపుపై తాము తప్పకుండా గళం విప్పుతామని హామీ ఇచ్చారు. గత అక్టోబర్‌లో టీజీఎస్ఆర్టీసీ బస్సు ఛార్జీలను పెంచిన విషయం తెలిసిందే. కాగా, కేటీఆర్ పోస్టుపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందనలు వస్తున్నాయి. కొందరు నెటిజన్లు ఛార్జీల పెంపును విమర్శిస్తుండగా, మరికొందరు కాంగ్రెస్‌కు ఓటు వేసి బీఆర్ఎస్‌ను ప్రశ్నించడం ఏంటని కామెంట్లు చేస్తున్నారు.



## నా పేరుతో మెసేజ్‌లు వస్తే నమ్మొద్దు: రకుల్

హైదరాబాద్/ముంబై, నవంబర్ 25 (ఈవార్తలు): తన పేరుతో కొందరు కేటుగాళ్లు నకిలీ వాట్సాప్ ఖాతా సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారని నటి రకుల్ ప్రీత్ సింగ్ సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ఆ నంబర్ నుంచి వచ్చే సందేశాలకు ఎవరూ స్పందించవద్దని, వెంటనే దాన్ని బ్లాక్ చేయాలని సూచించారు. 8111067586 అనే ఫోన్ నంబర్‌కు తన ఫొటోను డీపీగా పెట్టి, బయోలో తాను నటించిన సినిమాల పేర్లను రాసి.. కొందరు వ్యక్తులకు సందేశాలు పంపుతున్నట్లు రకుల్ గుర్తించారు. ఈ విషయం తెలియగానే ఆమె వెంటనే స్పందించారు. ఫేక్ చాట్ స్క్రీన్‌షాట్‌ను షేర్ చేస్తూ, "నా పేరుతో ఎవరో వాట్సాప్‌లో ప్రజలకు సందేశాలు పంపుతున్నారు. ఆ నంబర్‌కు స్పందించకండి. నాది కాదు" అని స్పష్టం చేశారు.

## అసెంబ్లీలో నేనే సీనియర్: ఉత్తమ్



హైదరాబాద్, నవంబర్ 25 (ఈవార్తలు): ప్రస్తుత శాసనసభలో తానే సీనియర్ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ తనకంటే సీనియర్ అయినప్పటికీ సభకు రావడం లేదని ఆయన అన్నారు. ప్రస్తుతం అసెంబ్లీకి వచ్చే వారిలో మాత్రం తాను సీనియర్ నాయకుడినని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయమై ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. ఏడుసార్లు ఒకే పార్టీ బీఫామ్‌పై గెలిచిన వ్యక్తిని తానే అని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు అమలులోకి వచ్చే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి రెండు అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయని పేర్కొన్నారు.



## విప్ ఆది, సిరిసిల్ల కలెక్టర్‌కు తప్పిన ప్రమాదం

**గృహ నిర్మాణ పథకం కింద నిర్మిస్తున్న ఇళ్ల సందర్శనకు వెళ్లిన ఎమ్మెల్యే**

**డబుల్ బెడ్రూం ఇళ్లను తనిఖీ చేస్తుండగా కూలిన బేస్‌మెంట్**

**కిందపడిపోకుండా పట్టుకున్న అధికారులు, సహాయకులు**

వేములవాడ, నవంబర్ 25 (ఈవార్తలు): ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్, ఇతర అధికారులకు పెను ప్రమాదం తృటిలో తప్పింది. వేములవాడలో గృహ నిర్మాణ పథకం కింద నిర్మిస్తున్న ఇళ్లను సందర్శించడానికి వారు వెళ్లారు. వేములవాడ మున్సిపల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను తనిఖీ చేస్తుండగా బేస్‌మెంట్ కూలిపోయింది. సహాయకులు, అధికారులు వెంటనే స్పందించి ఎమ్మెల్యే కింద పడకుండా పట్టుకున్నారు. ఈ ఘటనపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి ఈ బేస్‌మెంట్ కూలడమే నిదర్శనమని బీఆర్ఎస్ ఆరోపించింది. బీఆర్ఎస్ విమర్శలపై ఆది శ్రీనివాస్ సైతం స్పందించారు. బీఆర్ఎస్ హయాంలో ఆమోదించబడిన కాంట్రాక్టర్లు ఈ ఇంటిని నిర్మించారని ఆది శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో అన్నీ నాసిరకం పనులే జరిగాయనడానికి ఇదే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. బేస్‌మెంట్ మీద నిలబడిన వెంటనే అది కూలిపోయిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో అడ్డదారిలో డబ్బులు దోచుకోవడానికి, కమీషన్లు పొందడానికి నాణ్యత లేని పనులు చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే ఈ బేస్‌మెంట్ నిర్మాణం చేపట్టారని అన్నారు. ఆ నిర్మాణాన్ని కూడా మధ్యలోనే వదిలేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని నిర్ణయించామని, అందులో భాగంగానే కలెక్టర్, అధికారులతో కలిసి తాను తనిఖీలకు వెళ్లానని ఆది శ్రీనివాస్ తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బ్యారేజీలు కూడా కూలిపోయాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం వీలైనంత త్వరగా ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తుందని హామీ ఇచ్చారు.

## ఇతర పార్టీల్లో గెలిచినా చేర్చుకోం: జగ్గారెడ్డి

సంగారెడ్డి, నవంబర్ 25 (ఈవార్తలు): స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విధేయులకే ప్రాధాన్యత ఇస్తామని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఇతర పార్టీల మద్దతుతో గెలిచిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాము చేర్చుకోబోమని స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా పోటీ చేయనని అన్నారు. భార్య నిర్మలను అసెంబ్లీ ఎన్నికల బరిలో దింపుతానని తెలిపారు. తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చి మాట్లాడినా తన నిర్ణయం మారదని స్పష్టం చేశారు. తాను ఎన్నికల బరిలో ఉండనని తేల్చిచెప్పారు. కాగా, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూలు, నోటిఫికేషన్ ఈ సాయంత్రం విడుదల కానుంది. 31 జిల్లాల్లోని 545 గ్రామీణ మండలాల్లోని 12,760 పంచాయతీలు, 1,13,534 వార్డుల్లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయనుంది. మూడు విడల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.

## ఈసీ ఎక్కడ? ఉందా? నిద్రపోయిందా?

**సీఎం రేవంత్ వ్యాఖ్యలపై శ్రీనివాస్ గౌడ్ ఫైర్**

హైదరాబాద్, నవంబర్ 25 (ఈవార్తలు): ప్రభుత్వం ఇచ్చినచీర కట్టుకొని ఓట్లు వేయాలని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మరి రెండు సంవత్సరాల నుంచి ఎందుకు చీరలు ఇవ్వలేదని నిలదీశారు. ప్రభుత్వం ఇచ్చిన చీర కట్టుకొని ఓటు వేయండని బహిరంగంగా ముఖ్యమంత్రి అంటున్నారని. మరి ఎన్నికల కమిషన్ ఏం చేస్తుంది? ఎక్కడకు పోయింది? ఉందా నిద్రపోయిందా అని ప్రశ్నించారు. బీజేపీ ఎక్కడకు పోయిందని ప్రశ్నించారు. ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ అన్నట్టు ఉంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వైఖరి ఉందని విమర్శించారు. రెండేళ్ల నుంచి ఎక్కడకు పోయారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు ఎక్కడకు పోయాయని నిలదీశారు. అవ్వ తాతకు ఇస్తానని చెప్పిన పెన్షన్ ఎక్కడకు పోయిందని అడిగారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బడుగులకు బీసీ రిజర్వేషన్ల పై మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఎన్నో రకాల మోసాలను ఈ కాంగ్రెస్ పార్టీ బీసీలకు చేసిందని విమర్శించారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో ఒక్క బీసీ సర్పంచ్ లేడు అని.. మహబూబ్‌నగర్‌లో చాలా గ్రామాల్లో బీసీ సర్పంచ్‌లు లేరు, వార్డు మెంబర్లు లేరని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ లకు 2011 జనాభా లెక్కల ప్రకారం వార్డు మెంబర్లకు ఇస్తారని.. సర్పంచ్‌లకు మాత్రం అది ఇవ్వరని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై ఎక్కడ నియమ నిబంధనలు పాటించడం లేదని తెలిపారు.

## కొడంగల్ లిఫ్ట్ పేరు మార్పు

హైదరాబాద్, నవంబర్ 25 (ఈవార్తలు): రాష్ట్ర నీటిపారుదల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పేరును 'మక్తల్-నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం'గా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో 45ను విడుదల చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి ఈ పేరు మార్పు తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాలకు సాగునీరు అందించే లక్ష్యంతో రూపొందించారు. అయితే.. ప్రాజెక్టు పేరులో తమ ప్రాంతానికి కూడా ప్రాధాన్యం దక్కాలని మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద పట్టుబట్టినట్లు తెలుస్తోంది. గతంలో శ్రీహరి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ఈ పేరు మార్పు కోసం సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

# నేడు మల్లెగుట్టపై షష్టి ఉత్సవాలు షురూ



మల్యాల, నవంబర్ 25 (ఈవార్తలు): మల్యాల గ్రామ శివారులోని మల్లెగుట్టపై వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం షష్టి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభంకానున్నట్లు ఆలయ పూజారులు పేర్కొన్నారు. 7 వారాలపాటు జరిగే ఈ ఉత్సవాలలో భాగంగా మొదటిరోజు స్వామివారికి మైలపోలు, సుంకుబియ్యం, పెద్దపట్నం, స్వామివారి కళ్యాణం తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకోనున్నారు.



## కొండగట్టుకు పోటెత్తిన భక్తజనం

మల్యాల, నవంబర్ 25 (ఈవార్తలు): కొండగట్టుకు అంజన్న భక్తులు పోటెత్తారు. మంగళవారం కావడం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. గుట్టపై ఎటుచూసినా ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది.



# ముంచుకొస్తున్న సెన్యార్

**రైతులను అప్రమత్తం చేసిన అచ్చెన్నాయుడు**

వైజాగ్, నవంబర్ 25 (ఈవార్తలు): ఏపీ తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ఆ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం, వాయుగుండంగా మారి రానున్న 48 గంటల్లో తుపానుగా బలపడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. పంట నష్టం జరగకుండా రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. ముఖ్యంగా వరి కోతలు పూర్తిచేసిన రైతులు, తమ ధాన్యాన్ని తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు ప్రభుత్వం తరఫున రైతులకు ఉచితంగా టార్పలిన్ పట్టాలు పంపిణీ చేస్తున్నామని అచ్చెన్నాయుడు వెల్లడించారు. రైతులు జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించి వాటిని పొందవచ్చని తెలిపారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. సముద్రం అలజడిగా ఉన్నందున మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే వేటకు వెళ్లిన వారు వెంటనే తీరానికి తిరిగి రావాలని ఆదేశించారు. ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

### ఏపీకి భారీ వర్ష సూచన



మలేషియా, మలక్కా జలసంధి పరిసరాల్లో ఏర్పడిన అల్పపీడనం రానున్న 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) మంగళవారం ప్రకటించింది. ప్రస్తుతం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతున్న ఈ వ్యవస్థ, రాబోయే 24 గంటల్లో అండమాన్ సముద్రంలో వాయుగుండంగా బలపడనుంది. ఈ వాయుగుండం మరింత తీవ్రరూపం దాల్చి తుపానుగా మారనుంది. ఈ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలు, యానాంలో నవంబర్ 29న భారీ వర్షాలు, నవంబర్ 30న అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.



# జగిత్యాలలో మండలాలవారీగా షెడ్యూల్ విడుదల

జగిత్యాల టౌన్, నవంబర్ 25 (ఈవార్తలు): స్థానిక ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని నోడల్ ఆఫీసర్ లు ,ఆర్డీవోలు మరియు ఎంపిడివో లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేసిందని, షెడ్యూల్ ప్రకారం జిల్లాలో మూడు విడతలుగా ఎన్నికలు జరుగుతాయని అందుకు సంబందించిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు తెలిపారు. జిల్లాలో మొదటి విడత స్థానిక ఎన్నికలు 7 మండలాల్లో.. మేడిపెల్లి, భీమారం, కథలాపూర్, కోరుట్ల, మెట్ పెల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నంలో, రెండవ విడత స్థానిక ఎన్నికలు 7 మండలాల్లో.. రాయికల్, బీర్పూర్, జగిత్యాల, జగిత్యాల రూరల్, సారంగాపూర్, మల్యాల, కొడిమ్యాలలో, మూడవ విడత ఎన్నికలు 6 మండలాల్లో.. ధర్మపురి, బుగ్గారం, గొల్లపల్లి, వెల్గటూర్, ఎండపెల్లి,పెగడపెల్లిలో జరుగుతాయని వెల్లడించారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు ఫ్లెక్సీలు, స్టేషనరీ సంబంధించినవి బుధవారం మరోసారి సరి చూసుకోవాలని, పోలింగ్ కేంద్రాలను సందర్శించాలని తెలిపారు.

# సకాలంలో రాజన్న ఆలయం పూర్తి

## ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ వెల్లడి.. ఆలయ విస్తరణ పనుల పరిశీలన



వేములవాడ, నవంబర్ 25 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఆలయ దక్షిణ భాగంలో భారీ యంత్రాలతో చేస్తున్న పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు వేములవాడ ఆర్టీసీ డిపో సమీపంలోని నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రభుత్వ విప్ ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మిస్తున్నారు? ఎప్పటి వరకు పూర్తి చేస్తారో ఆరా తీశారు. మొత్తం రూ. 5 కోట్ల 61 లక్షల వ్యయంతో 144 ఇండ్లు నిర్మిస్తున్నామని అధికారులు తెలిపారు. అక్కడి నుంచి నేరుగా మూలవాగుపై నిర్మిస్తున్న నూతన బ్రిడ్జి పనులను, వేములవాడ ప్రధాన ఆలయం నుంచి తిప్పాపూర్ బస్ స్టాండ్ వరకు నిర్మిస్తున్న రోడ్డు, డ్రైనేజ్ పనులను పరిశీలించారు. భీమేశ్వర ఆలయంలో భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. షవర్లు, కళ్యాణకట్ట, క్యూ లైన్లు పరిశీలించి, ఆలయ ఈఓ, ఇంజనీరింగ్ అధికారులకు విప్, ఇంచార్జి కలెక్టర్ సూచనలు చేశారు.

### భీమేశ్వర ఆలయంలో పూజలు

భీమేశ్వర ఆలయంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా విప్, ఇంచార్జి కలెక్టర్ కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఇంచార్జి కలెక్టర్కు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆశీర్వాదం అందజేశారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీవో రాధాభాయ్, ఆలయ ఈవో రమాదేవి, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: అడ్లూరి



పెగడపల్లి, నవంబర్ 25 (ఈవార్తలు): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని పెగడపల్లిలో వడ్డీలేని ఋణాల పంపిణీ కార్యక్రమం ప్రారంభంతో పాటు, ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్, కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం 3.50 లక్షల మహిళా సంఘాలకు 304 కోట్ల రూపాయల వడ్డీ లేని ఋణాలు సోమవారం విడుదల చేయగా జగిత్యాల జిల్లాలో 2025-26 వ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 11,825 స్వయం సహాయక సంఘాలకు రూ.10.69 కోట్లు వడ్డీ లేని ఋణాలు విడుదల అయ్యాయని తెలిపారు. మహిళలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని వెల్లడించారు. జిల్లాలో ఇప్పటివరకు 10853 ఇండ్లు మంజూరు అయ్యాయని, కొంతమంది లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని గృహ ప్రవేశ కార్యక్రమాలకు తమను ఆహ్వానించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో మధుసుధన్, డీఆర్డీవో రఘువరన్ , ఎమ్మార్వో, ఎంపీడీవో , స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా పద్మావతి అమ్మవారి పంచమితీర్థం

తిరుచానూరు, నవంబర్ 25 (ఈవార్తలు): తిరుచానూరు పద్మావతి అమ్మవారు అవతరించిన పంచమి తిథిని పురస్కరించిన కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం పంచమీ తీర్థం(చక్రస్నానం) అశేష భక్తజనవాహిని మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. పద్మ పుష్కరిణిలో పెద్ద సంఖ్యలో పవిత్రస్నానాలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ లక్షలాది మంది భక్తుల సమూహంలో అమ్మవారి పంచమీతీర్థ మహోత్సవం వైభవోపేతంగా జరిగిందన్నారు. వేలాదిమంది భక్తులు పుణ్య స్థానాలు ఆచరిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీలోని అన్ని విభాగాలు పటిష్టమైన ఏర్పాట్లు చేసి, విజయవంతంగా జరిగాయన్నారు. అన్ని విభాగాల అధికారులు, భద్రతా సిబ్బంది, పోలీసులు, శ్రీవారి సేవకులు, పారిశుధ్య కార్మికులు విశేషంగా కృషి చేశారని వారిని అభినందించారు. భక్తులందరికీ అమ్మవారి కరుణాకటాక్షాలు కలగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# చిన్నారుల ముందు అసభ్య నృత్యం.. హెూంగార్డు సస్పెండ్

కృష్ణా, నవంబర్ 25 (ఈవార్తలు): ఓ ప్రైవేట్ వేడుకలో అశ్లీల నృత్యం చేసిన హెూంగార్డుపై కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు కఠిన చర్యలు తీసుకున్నారు. క్రమశిక్షణ ఉల్లంఘన కింద అతడిని సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. కృష్ణా జిల్లాలో హెూంగార్డుగా పనిచేస్తున్న అజయ్ కుమార్ ఇటీవల ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నాడు. అక్కడ డీజే పాటలకు ఓ యువతితో కలిసి చిన్నారుల ఎదుటే అసభ్యకరంగా నృత్యం చేశాడు. ఈ దృశ్యాలను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది కాస్తా వైరల్ అయింది. ప్రభుత్వ ఉద్యోగిగా, పోలీసు శాఖకు చెందిన వ్యక్తిగా యూనిఫామ్ గౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియో ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వారు తీవ్రంగా స్పందించారు. దీనిపై విచారణకు ఆదేశించిన ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, హెూంగార్డు క్రమశిక్షణను ఉల్లంఘించినట్లు నిర్ధారించారు. పోలీసు శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించే ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో తక్షణమే అజయ్ కుమార్ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# సింగర్ జుబీన్‌ది హత్యే

**చంపి.. మృతిగా చిత్రీకరించారు.. అస్సాంలో అసెంబ్లీలో హిమంత బిశ్వ శర్మ వెల్లడి**

గౌహతి: అస్సామీ సింగర్ జుబీన్ గార్గ్ అకాల మరణంతో ఆయన కుటుంబం సహా అభిమానుల్లో తీవ్ర విషాదం నెలకొంది. సింగపూర్ లో స్కూబా డైవింగ్ చేస్తూ జుబీన్ సముద్రంలో మునిగి చనిపోయారు. ఇప్పటి వరకూ ఇది ప్రమాదవశాత్తూ జరిగిందని భావించగా.. తాజాగా అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ దీని వెనక కుట్ర ఉందని వెల్లడించారు. జుబీన్ ప్రమాదవశాత్తూ చనిపోలేదని, ఆయన హత్యకు గురయ్యారని అసెంబ్లీలో వెల్లడించారు. జుబీన్ హంతకులను వదిలిపెట్టబోమని, చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు. 'నార్త్ ఈస్ట్ ఇండియా ఫెస్టివల్' లో పాల్గొనేందుకు జుబీన్ గార్గ్ సింగపూర్ వెళ్లారు. అక్కడ సెయింట్ జాన్స్ ఐలాండ్ తీరంలో లైఫ్ జాకెట్ లేకుండా ఈత కొడుతూ లేదా స్కూబా డైవింగ్ చేస్తుండగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డారు. వెంటనే అతన్ని సింగపూర్ జనరల్ హాస్పిటల్‌లోని ఐసీయూకి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ ఆయన మరణించారు. సింగపూర్ అధికారులు జుబీన్ మరణానికి కారణం "మునిగిపోవడం" అని పేర్కొంటూ డెత్ సర్టిఫికేట్ అందించారు.

# డిసెంబర్ 30 నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు

**టికెట్ల బుకింగ్ షెడ్యూల్ విడుదల చేసిన టీటీడీ**



తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నది. ఇందులో భాగంగా సామాన్య భక్తులకు పెద్దపీట వేసేలా పలు నిర్ణయాలు తీసుకుంది. వైకుంఠ ద్వార దర్శనాల విధి, విధానాలు విడుదల చేసింది. వైకుంఠ ఏకాదశి, వైకుంఠ ద్వాదశి, నూతన సంవత్సరం సందర్భంగా తొలి మూడు రోజుల వైకుంఠ ద్వార దర్శనాలకు అంటే డిసెంబర్ 30, 31, జనవరి 1వ తేదీలకు సంబంధించి ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా సర్వ దర్శన టోకెన్లను ఆన్‌లైన్ లో కేటాయించనున్నారు. కుటుంబ సభ్యులందరికీ అందుబాటులో ఉండే విధంగా వన్ ప్లస్ త్రీ విధానంలో టోకెన్లు జారీ చేయనున్నట్లు చెప్పింది. నవంబర్ 27 నుంచి డిసెంబర్ ఒకటి వరకు ఎలక్ట్రానిక్ డిప్ నమోదుకు అవకాశం ఇచ్చింది. తొలి మూడురోజులకు వైకుంఠ ద్వారా దర్శనాలకు ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి డిసెంబర్ ఒకటి సాయంత్రం 5 గంటల వరకు టీటీడీ వెబ్‌సైట్ ttdevasthanams.ap.gov.in, మొబైల్ యాప్, వాట్సాప్ లో ఏపీ గవర్నమెంట్‌బాట్‌లో టీటీడీ ఆలయాల విభాగంలో ఎలక్ట్రానిక్ డిప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని చెప్పింది. డిసెంబర్ 2న మధ్యాహ్నం 2 గంటలకు డిప్ వివరాలు ప్రకటించనున్నట్లు చెప్పింది. అనంతరం డిసెంబర్ 30, 31, జనవరి 1వ తేదీల్లో దర్శనం కావాల్సిన రోజులను, మూడు రోజులను ప్రయారిటీగా ఎంపిక చేసుకునే అవకాశం కూడా కల్పిస్తున్నట్లు పేర్కొంది. వైకుంఠ ద్వార దర్శనాల నేపథ్యంలో డిసెంబర్ 30 నుండి జనవరి 8 వరకు శ్రీవారి ఆలయంలో చంటి పిల్లల తల్లిదండ్రులు, వృద్ధులు, వికలాంగులు, డిఫెన్స్, ఎన్ఆర్ఐ తదితర ప్రత్యేక దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. జనవరి 6, 7, 8 వ తేదీల్లో స్థానికులకు స్థానికుల కోటా కింద దర్శనం కల్పించనున్నట్లు పేర్కొంది.



# కర్నూలులో హైకోర్టు బెంచ్

కర్నూలు, నవంబర్ 25 (ఈవార్తలు): రాయలసీమ వాసుల చిరకాల ఆకాంక్ష అయిన కర్నూలు హైకోర్టు బెంచ్ ఏర్పాటు అంశంపై ఆ రాష్ట్ర మంత్రి టీజీ భరత్ కీలక ప్రకటన చేశారు. ఎప్పటి నుంచో చర్చలో ఉన్న ఈ అంశంపై స్పష్టతనిస్తూ, నగరంలోని ఏబీసీ క్యాంప్ క్వార్టర్స్‌లో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. కర్నూలు అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వేగంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇదే సమయంలో ప్రభుత్వ క్వార్టర్స్‌లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ ఆస్తుల వద్ద అనైతిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, రచ్చ చేసే వారిని కూటమి ప్రభుత్వం కఠినంగా ఎదుర్కొంటుందని హెచ్చరించారు. "అవసరమైతే కర్రతో సమాధానం చెబుతాం" అని ఆయన తీవ్ర స్వరంతో అన్నారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కర్నూలు మెడికల్ కళాశాల మసీదు వద్ద నూతన రోడ్డు పనులను ప్రారంభించిన సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. నగరంలో ఇంకా చాలా ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ అవసరం ఉందని, త్వరలోనే మరిన్ని చోట్ల అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

# గోదావరి పుష్కరాలకు ముహూర్తం ఖరారు

అమరావతి, నవంబర్ 25 (ఈవార్తలు): గోదావరి పుష్కరాలకు ముహూర్తం ఖరారైంది. దేశ విదేశాల నుంచి గోదావరి పుష్కరాలకు తరలి రానున్నారు. కేంద్రంతో పాటుగా ఏపీ ప్రభుత్వం పుష్కరాల నిర్వహణ కోసం ప్రత్యేక చర్యలు మొదలు పెట్టింది. కేంద్రం నిధులను ప్రకటించింది. రైల్వే శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కమిటీల ఏర్పాటుతో పాటుగా నిధులను విడుదల చేసింది. కాగా.. కుంభమేళా తరహాలో ఘాట్లు - వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాల నిర్వహణకు నిర్ణయించారు. కేంద్రం ముందస్తుగానే గోదావరి పుష్కరాల కోసం నిధులు కేటాయించింది. ఇప్పటికే రూ 100 కోట్ల ను పుష్కరాల కోసం ప్రకటించారు. తాజాగా రైల్వే శాఖ పుష్కరాల కు వచ్చే భక్తుల సౌకర్యాల కల్పన కోసం రాజమండ్రి రైల్వే స్టేషన్ కు రూ 271.43 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. దేశంలో ప్రధాన ప్రాంతాల నుంచి రాజమండ్రికి ప్రత్యేక రైళ్లు నడుపుతామని.. ముందస్తు గానే ఖరారు చేస్తామని అధికారులు వెల్లడించారు. అఖండ గోదావరి పుష్కరాలు-2027 ముసాయిదా యాక్షన్ ప్లాన్ సిద్ధమైంది. అందరూ ఒకే ఘాట్‌లో స్నానాలు చేసే అవసరం లేకుండా గోదావరి నదిలో ఎక్కడైనా స్నానాలు చేయొచ్చని ప్రచారం చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న 17 ఘాట్లకు రోజుకు 75,11,616 మంది వస్తారని అంచనా వేస్తున్నారు.

# సీట్లో ఉండాలా? దిగిపోవాలా?



## ఏదో ఒకటి తేల్చేయండి

### అధిష్ఠానానికి సిద్ధరామయ్య సూచన

బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి మార్పు అంశంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరోమారు స్పందించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటింది. అధికారంలోకి వచ్చాక సిద్ధరామయ్య ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, సిద్ధరామయ్య, డీ.కే. శివకుమార్ చెరో రెండున్నరేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారనే ప్రచారం మొదటి నుంచి ఉంది. ఈ క్రమంలో రెండవ దఫా సీఎంగా ఉప ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్‌కు అవకాశం ఉంటుందనే ప్రచారం కొంతకాలంగా కొనసాగుతోంది. పార్టీ పెద్దలు, సిద్ధరామయ్య, ఆయన వర్గం ఈ ప్రచారాన్ని ఖండిస్తున్నప్పటికీ, ఊహాగానాలు మాత్రం ఆగడం లేదు. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్య ఈ అంశంపై మరోసారి స్పందించారు. ఇటువంటి ప్రచారానికి ముగింపు పలికేలా పార్టీ అధిష్ఠానం ఒక నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. సిద్ధరామయ్య ఐదేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని డీ.కే. శివకుమార్ చెబుతున్నప్పటికీ, ఆయన వర్గం ఎమ్మెల్యేల తీరు మాత్రం మరో విధంగా ఉంది. ప్రస్తుత కర్ణాటక కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై కేంద్ర మంత్రి కుమారస్వామి స్పందించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా తీవ్ర గందరగోళంలో ఉందని ఆయన అన్నారు. మరికొన్ని నెలల్లో అనూహ్య పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. కుమారస్వామి వ్యాఖ్యల నేపథ్యంలో సిద్ధరామయ్య అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు.

# నాతో పెట్టుకుంటే ఫసక్!



## మీ పునాదులుకదిలిస్తా

### బీజేపీకి మమతా బెనర్జీ హెచ్చరిక

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో తనను సవాల్ చేసే ప్రయత్నం చేయవద్దని బీజేపీకి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హెచ్చరిక జారీ చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తనతో రాజకీయంగా పోరాడే శక్తి బీజేపీకి లేదని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో తనను ఓడించడం ఆ పార్టీకి సాధ్యం కాదని తేల్చిచెప్పారు. బెంగాల్‌లో తనకు సవాల్ విసిరేందుకు ప్రయత్నిస్తే దేశవ్యాప్తంగా బీజేపీ పునాదులను కదిలిస్తానని హెచ్చరించారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని, అది బీజేపీ కమిషన్‌గా మారిందని ఆరోపించారు. బీహార్‌లో బీజేపీ వ్యూహాలను అక్కడి ప్రతిపక్షాలు అంచనా వేయలేకపోయాయని వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ కారణంగానే బీహార్ ఎన్నికల ఫలితాలు ఎన్డీయే కూటమికి అనుకూలంగా వచ్చాయని అభిప్రాయపడ్డారు. అక్రమంగా దేశంలో ఉంటున్న బంగ్లాదేశీయులను తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమైతే, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ ప్రక్రియను ఎందుకు చేపడుతున్నారని ప్రశ్నించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఉన్న రాష్ట్రాల్లో కూడా చొరబాటుదారులు ఉన్నట్లు వారు అంగీకరిస్తున్నారా అని నిలదీశారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ అనంతరం ముసాయిదా ఓటరు జాబితా వెలువడ్డాక ఈసీ, బీజేపీ సృష్టించిన గందరగోళాన్ని ప్రజలే గుర్తిస్తారని అన్నారు.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. నవంబర్ సిరీస్ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ వో) కాంట్రాక్టుల గడువు ముగుస్తుండటంతో ట్రేడర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. దీంతో సూచీలు రోజంతా ఒడిదొడుకులకు లోనయ్యాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 313.7 పాయింట్లు నష్టపోయి 84,587.01 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 74.7 పాయింట్లు క్షీణించి 25,884.8 వద్ద ముగిసింది. నిపుణుల అంచనా ప్రకారం, నిఫ్టీకి 26,000 స్థాయి వద్ద అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. రంగాల వారీగా మిశ్రమ ప్రదర్శన నమోదైంది. నిఫ్టీ రియల్టీ సూచీ 1.62%, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 1.44% చొప్పున లాభపడ్డాయి. మరోవైపు, నిఫ్టీ ఐటీ 0.57%, నిఫ్టీ మీడియా 0.80% మేర నష్టపోయాయి. ప్రధాన సూచీలు నష్టపోయినప్పటికీ, బ్రాడర్ మార్కెట్లు సానుకూలంగా రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.36%, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.19% చొప్పున లాభపడ్డాయి. ఎక్స్‌పైరీకి సంబంధించిన ఒడిదొడుకులతో పాటు, అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల కోతపై స్పష్టత కోసం ఇన్వెస్టర్లు వేచి చూస్తుండటం మార్కెట్లపై ప్రభావం చూపిందని విశ్లేషకులు తెలిపారు.

# రిలయన్స్.. రయ్ రయ్

ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. దేశంలోనే అత్యంత విలువైన ఈ కంపెనీ షేరు, ఇవాళ్టి ట్రేడింగ్‌లో ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయిని తాకి ఇన్వెస్టర్లకు లాభాల పంట పండించింది. ఈ ర్యాలీతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 21 లక్షల కోట్లకు చేరింది. ఈరోజు ఉదయం ట్రేడింగ్‌లో రిలయన్స్ షేరు దాదాపు 2 శాతం లాభపడి, ఇంట్రాడేలో రూ. 1559.60 వద్ద జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఇదే ఈ షేరుకు 52 వారాల గరిష్ఠ ధర కూడా కావడం విశేషం. ఈ స్టాక్ 52 వారాల కనిష్ఠ ధర రూ. 1114.85 కాగా, అక్కడి నుంచి సుమారు 40 శాతం మేర వృద్ధి చెందింది. రిలయన్స్ షేరు తాజా ర్యాలీకి ప్రముఖ గ్లోబల్ బ్రోకరేజీ సంస్థ జేపీ మోర్గాన్ ఇచ్చిన నివేదికే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. జేపీ మోర్గాన్ ఈ స్టాక్‌కు 'ఓవర్‌వెయిట్' రేటింగ్ ఇచ్చింది. అంతేకాకుండా ప్రస్తుత ధర నుంచి 11 శాతం అధికంగా రూ. 1727 టార్గెట్ ధరను అంచనా వేసింది. ఈ సానుకూల నివేదికతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. దీనికితోడు ఇటీవల వెలువడిన రెండో త్రైమాసిక ఫలితాల్లో కంపెనీ నికర లాభం 9.6 శాతం పెరగడం కూడా షేరుకు కలిసొచ్చింది. గత కొంతకాలంగా ఈ షేరు నిలకడగా కొనసాగుతోంది.

# పైలట్లు, సిబ్బందికి ఫాటిగ్ ట్రైనింగ్



న్యూఢిల్లీ: విమాన భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కీలక ఆదేశాలు జారీ చేసింది. పైలట్లు, క్యాబిన్ సిబ్బందితో పాటు విమాన షెడ్యూళ్లను ప్లాన్ చేసే సిబ్బందికి కూడా ఏటా ఫాటిగ్ మేనేజ్‌మెంట్‌పై (అలసట నిర్వహణ) శిక్షణను తప్పనిసరి చేసింది. ఇటీవల కాలంలో విమాన సిబ్బంది పని గంటలు పెరగడం, వారి అలసట భద్రతపై ప్రభావం చూపుతుందన్న ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త నిబంధనల ప్రకారం, ప్రతీ విమానయాన సంస్థ తమ రెగ్యులర్ గ్రౌండ్ ట్రైనింగ్‌లో భాగంగా ఏటా కనీసం ఒక గంట ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. ఇందులో విమాన ప్రయాణ గంటలు, డ్యూటీ పరిమితులు, తప్పనిసరి విశ్రాంతి నియమాలతో పాటు, నిద్రకు సంబంధించిన శాస్త్రీయ అంశాలు, శరీర గడియారాన్ని (బాడీ క్లాక్) ప్రభావితం చేసే అంశాలు, అలసట పనితీరుపై ఎలా ప్రభావం చూపుతుందనే విషయాలపై అవగాహన కల్పిస్తారు. సిబ్బంది తమ అలసట గురించి ఫిర్యాదు చేసేందుకు పారదర్శకమైన వ్యవస్థను, వాటిని సమీక్షించి దిద్దుబాటు చర్యలు సూచించేందుకు ఒక స్వతంత్ర ఫాటిగ్ రివ్యూ కమిటీని ఏర్పాటు చేయాలని కూడా డీజీసీఏ ఎయిర్‌లైన్స్‌ను ఆదేశించింది. ఎంతమంది సిబ్బందికి శిక్షణ ఇచ్చారు, ఎన్ని అలసట ఫిర్యాదులు వచ్చాయి, వాటిలో ఎన్నింటిని స్వీకరించారు, ఎందుకు తిరస్కరించారు అనే వివరాలతో ప్రతీ మూడు నెలలకు ఒకసారి తమకు నివేదిక పంపాలని స్పష్టం చేసింది. గత జులైలో జరిపిన ఆడిట్‌లో కొన్ని విమానయాన సంస్థలు అలసటకు సంబంధించిన నిబంధనలను సరిగ్గా పాటించడం లేదని డీజీసీఏ గుర్తించింది. పైలట్ సంఘాలు కూడా రాత్రిపూట ల్యాండింగ్‌లు పెంచడం భద్రతకు ముప్పు అని హెచ్చరించాయి. గతంలో వారపు విశ్రాంతిని 48 గంటలకు పెంచుతూ డీజీసీఏ తీసుకున్న నిర్ణయాన్ని కొన్ని సంస్థలు వ్యతిరేకించినా, ఢిల్లీ హైకోర్టు ఆదేశాలతో అవి అమలయ్యాయి. ఈ నేపథ్యంలో, సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అలసట వల్ల తలెత్తే ముప్పును ముందుగానే నివారించే లక్ష్యంతో డీజీసీఏ ఈ కొత్త నిబంధనలను తీసుకొచ్చింది.

# మరో 28 మంది నక్సల్స్ లొంగుబాటు

## వారిలో 19 మంది మహిళలు..

### రూ.89 లక్షల రివార్డు



బస్తర్: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రేంజ్‌లో మావోయిస్టు ఉద్యమానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న 'పున మర్గం'(పునరావాసం నుంచి పునరుజ్జీవనం) కార్యక్రమంలో భాగంగా, మంగళవారం నారాయణ్‌పూర్ జిల్లాలో 28 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 19 మంది మహిళలు ఉండగా, అందరిపైనా కలిపి మొత్తం రూ. 89 లక్షల రివార్డు ఉందని అధికారులు వెల్లడించారు. హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు వీరు ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం, బస్తర్ పోలీసులు, స్థానిక యంత్రాంగం, భద్రతా దళాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి. ఈ ప్రాంతంలో శాంతి స్థాపన, అభివృద్ధి లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన వారిలో మాద్ డివిజన్ డీవీసీఎం, పీఎల్‌జీఏ కంపెనీ నెం. 06 మిలిటరీ సభ్యుడు, ఏరియా కమిటీ సభ్యుడు, టెక్నికల్ టీమ్ సభ్యుడు, మిలిటరీ ప్లాటూన్ సభ్యులు, సప్లై టీమ్ సభ్యులు వంటి పలు స్థాయిలకు చెందిన వారు ఉన్నారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు ఒక ఎస్ఎల్ఆర్, ఒక ఇన్సాస్, ఒక .303 రైఫిల్‌తో సహా ఆయుధాలను భద్రతా దళాలకు అప్పగించారు. ఈ పరిణామంతో 2025లో ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 287 మంది మావోయిస్టు క్యాడర్లు లొంగిపోయారని నారాయణ్‌పూర్ ఎస్పీ రాబిన్సన్ గుడియా తెలిపారు. గత 50 రోజుల్లోనే బస్తర్ వ్యాప్తంగా 512 మంది మావోయిస్టు క్యాడర్లు హింసను వీడి జనజీవన స్రవంతిలో చేరారని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పత్తిలింగం పేర్కొన్నారు. మావోయిస్టు అగ్ర నాయకులు దేవ్‌జీ, రామ్‌దర్‌లకు కూడా లొంగిపోవడం తప్ప మరో మార్గం లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిష్ఠా మామ్‌గయ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ కమాండర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆర్మీ అధికారికి మతం ఉండదు

## గురుద్వారాలోకి వెళ్లనన్నందుకు డిస్మిస్

### సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు



న్యూఢిల్లీ: గురుద్వారాలోకి వెళ్లేందుకు నిరాకరించడంతో ఉద్యోగం నుంచి తొలగించిన క్రైస్తవ ఆర్మీ అధికారిపై సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం తీవ్ర విమర్శలు చేసింది. అతడ్ని దుర్మార్గుడితో పోల్చుతూ సైన్యానికి తగని వ్యక్తని అభివర్ణించింది. తన సహోద్యోగి (సిక్కు) ధర్మాన్ని గౌరవించడంలో విఫలమైనందుకు విధుల నుంచి అతడ్ని తొలగిస్తూ సైన్యం తీసుకున్న నిర్ణయాన్ని ఈ మేరకు సుప్రీంకోర్టు సమర్థించింది. 'ఓ ఆర్మీ అధికారి తీవ్రమైన క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడి సమాజానికి ఎటువంటి సందేశం పంపుతున్నారు?.. అతడ్ని తొలగించాల్సిందే.... ఇలాంటి దుర్మార్గమైన వ్యక్తులు సైన్యంలో ఉండటానికి అర్హులేనా?.. 'అతడు సమర్థవంతమైన అధికారి కావచ్చు కానీ, ఇండియన్ ఆర్మీకి అతడి పనికిరాడు.. మన సైన్యాలకు ఉన్న బాధ్యతలను విస్మరించారు.. ఈ సమయంలో మేము దీనిని అనుమతించాలనుకోవడం లేదు.' అని నూతన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. తనను తొలగిస్తూ ఆర్మీ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మాజీ లెఫ్టినెంట్ శామ్యూల్ కమలేసన్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. వివరాల్లోకి వెళ్తే.. ఇండియన ఆర్మీకి చెందిన 3వ అశ్వికదళ రెజ్మెంట్‌లో లెఫ్టినెంట్‌గా పనిచేస్తోన్న శ్యామ్యూల్ కమలేసన్ గురుద్వారలోకి వెళ్లి పూజ నిర్వహించాలన్న తన ఉన్నతాధికారి ఆదేశాన్ని తిరస్కరించారు. ఇది తన క్రైస్తవ మత విశ్వాసాలకు విరుద్ధమని వాదించాడు. దీంతో క్రమశిక్షణను ఉల్లఘించినందుకు అతడ్ని సైన్యం నుంచి తొలగించారు. దీనిని ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేయగా.. ఆర్మీ నిర్ణయాన్ని న్యాయస్థానం సమర్దించింది. ఇది స్పష్టంగా క్రమశిక్షణా రాహిత్యమేనని, కమలేసన్ చర్యను కీలకమైన సైనిక నియమావళి ఉల్లంఘనగా కోర్టు వ్యాఖ్యానించింది.

# బంగ్లాదేశ్‌కు పాక్ లక్ష టన్నుల బిన్నం

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ప్రభుత్వం బంగ్లాదేశ్‌కు లక్ష టన్నుల బియ్యం ఎగుమతి చేయనుంది. ఇంత పెద్ద మొత్తంలో బియ్యం రవాణా చేయడం ఇదే మొదటిసారి. ఈ మేరకు గత వారమే టెండర్ జారీ అయింది. షేక్ హసీనా ప్రధానిగా ఉన్న సమయంలో బంగ్లాదేశ్... భారత్‌తో సన్నిహిత సంబంధాలు కొనసాగించింది. అయితే, మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాకిస్థాన్‌తో బంగ్లాదేశ్ సంబంధాలు పెంచుకుంటోంది. ఇటీవల జరిగిన సదస్సుల్లో రెండు దేశాలు పలు అంశాలపై ఒప్పందాలు చేసుకున్నాయి. వాటిని అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నాయి. పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్‌కు దాదాపు రెండు లక్షల టన్నుల బియ్యం ఎగుమతికి ఒప్పందం కుదిరిందని సమాచారం. మొదటి దశలో 50 వేల టన్నుల బియ్యం బంగ్లాదేశ్‌కు వెళ్లనుంది. ఇటీవల ఢాకాలో జరిగిన సదస్సులో పాకిస్థాన్, బంగ్లాదేశ్ పలు ఒప్పందాలు చేసుకున్నాయి. వాణిజ్యం, పెట్టుబడులు, పరిశ్రమలు, వ్యవసాయం, రవాణా తదితర రంగాల్లో పరస్పర సహకారానికి అంగీకరించాయి. వాణిజ్య విస్తరణ కోసం కరాచీ పోర్టు ట్రస్ట్‌ను వినియోగించుకోవడానికి అవకాశం కల్పిస్తామని బంగ్లాదేశ్‌కు పాకిస్థాన్ హామీ ఇచ్చింది. టూరిజం, మెడికల్ ట్రావెల్ వృద్ధి కోసం నేరుగా విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించాయి.

# ఢిల్లీ కాలుష్యంపై పీఎంవో సీక్ష

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకోవడంపై ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో వాయు నాణ్యత ప్రమాదకరంగా పడిపోతున్న నేపథ్యంలో పీఎంవో రంగంలోకి దిగింది. కాలుష్యానికి కారకమయ్యే వాహనాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. కాలుష్య నివారణలో భాగంగా విద్యుత్ వాహనాల వినియోగాన్ని విస్తృతం చేసేందుకు చర్యలు ముమ్మరం చేయాలని సూచించింది. ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఢిల్లీలోని వాయు నాణ్యతపై చర్చించారు. ఈ సందర్భంగా ఢిల్లీలో వాహనాల కాలుష్యం ప్రధానాంశంగా ప్రస్తావనకు వచ్చింది. దేశ రాజధానిలో ఇంకా 37 శాతం మేర పాత వాహనాలు వినియోగంలో ఉన్నట్లు సమావేశంలో చర్చించినట్లు సమాచారం. వాటి స్థానంలో ఈవీ వాహనాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఈవీ వాహనాలకు రాయితీలు ఇవ్వడంతో పాటు ఛార్జింగ్ స్టేషన్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. కాలుష్య కారక పెట్రోల్, డీజిల్ వాహనాలు వినియోగాన్ని తగ్గించాలని అన్నారు.

# గోల్డ్ కార్డు వచ్చేస్తోంది!

## డిసెంబర్ 18న ప్రారంభానికి ట్రంప్ సర్కారు సన్నాహాలు

వాషింగ్టన్: అమెరికాలో స్థిరపడాలనుకునే సంపన్న విదేశీయుల కోసం డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సరికొత్త వీసా విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. భారీగా ఆర్థిక సహకారం అందించే వారికి శాశ్వత నివాస హోదా (గ్రీన్ కార్డ్) కల్పించే 'గోల్డ్ కార్డ్' పథకాన్ని త్వరలో ప్రారంభించనుంది. దీనికి సంబంధించిన దరఖాస్తు ఫారం ఐ-140జీ ముసాయిదాను యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ఇప్పటికే ప్రభుత్వ పరిశీలనకు పంపింది. అన్ని అనుమతులు లభిస్తే, డిసెంబర్ 18 నాటికి ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కొత్త పథకం కింద, అమెరికాకు గణనీయమైన ప్రయోజనం చేకూర్చగలరని భావించే వ్యక్తులకు శాశ్వత నివాస హోదా కల్పిస్తారు. దరఖాస్తుదారులు తిరిగి చెల్లించని ప్రాసెసింగ్ ఫీజుతో పాటు వీసా ఆమోదం పొందాక మిలియన్ డాలర్లను (సుమారు రూ. 8.3 కోట్లు) ప్రభుత్వానికి కానుకగా చెల్లించాల్సి ఉంటుంది. కార్పొరేట్ సంస్థల ద్వారా దరఖాస్తు చేసుకునే వారికి ఈ మొత్తం 2 మిలియన్ డాలర్లుగా ఉంటుంది. ప్రాసెసింగ్ ఫీజుగా 15,000 డాలర్లు వసూలు చేస్తారు. దీంతో పాటు, 5 మిలియన్ డాలర్ల కానుకతో 'ప్లాటినం కార్డ్' ఆప్షన్‌ను కూడా తీసుకువస్తున్నట్లు తెలిసింది.

# యాపిల్‌లో లేఆఫ్స్



న్యూయార్క్: ప్రపంచంలోనే అత్యంత విలువైన టెక్నాలజీ కంపెనీ యాపిల్ తన గ్లోబల్ సేల్స్ ఆపరేషన్స్‌లో డజన్ల కొద్దీ ఉద్యోగాలను తొలగించింది. సాధారణంగా భారీ లేఆఫ్స్‌కు దూరంగా ఉండే యాపిల్‌లో ఈ పరిణామాన్ని అరుదుగా పరిగణిస్తున్నారు. గత రెండు వారాల్లో ప్రభావిత ఉద్యోగులకు యాజమాన్యం సమాచారం అందించినట్లు బ్లూమ్‌బెర్గ్ తన కథనంలో వెల్లడించింది. ప్రధానంగా కార్పొరేట్ సంస్థలు, పాఠశాలలు, ప్రభుత్వ ఏజెన్సీలతో పనిచేసే సేల్స్ బృందాలపై ఈ కోతల ప్రభావం పడింది. వీరితో పాటు, కొత్త కస్టమర్లకు ఉత్పత్తి డెమోలు ఇచ్చే బ్రీఫింగ్ సెంటర్ల సిబ్బందిని కూడా తొలగించారు. అయితే, మొత్తం ఎంతమందిని తొలగించారనే దానిపై కంపెనీ స్పష్టతను ఇవ్వలేదు. ఈ విషయంపై యాపిల్ స్పందిస్తూ తమ కార్పొరేట్ సేల్స్ నిర్మాణాన్ని పునర్ వ్యవస్థీకరిస్తున్నట్లు ధ్రువీకరించింది. "మరింత ఎక్కువ మంది కస్టమర్లతో అనుసంధానం కావడానికి, మా సేల్స్ బృందంలో కొన్ని మార్పులు చేస్తున్నాం. దీనివల్ల తక్కువ సంఖ్యలో ఉద్యోగాలపై ప్రభావం పడుతుంది. మేము నియామకాలు కొనసాగిస్తున్నాం. ప్రభావితమైన ఉద్యోగులు కొత్త పాత్రలకు దరఖాస్తు చేసుకోవచ్చు" అని యాపిల్ ప్రతినిధి ఒకరు బ్లూమ్‌బెర్గ్‌కు తెలిపారు.


సిమ్రన్ కౌర్

# సంక్రాంతికి 'అనగనగ ఒక రాజు' జాతర!




సినిమాలకు సంక్రాంతి కళ వచ్చేసింది. అందులో భాగంగా నవీన్ పోలిశెట్టి, మీనాక్షి చౌదరి జంటగా నటిస్తున్న 'అనగనగా ఒక రాజు' సినిమా నుంచి మేకర్స్ ఒక క్రేజీ పోస్టర్‌ను వదిలారు. ఇందులో వీరిద్దరూ కలిసి వేస్తున్న స్టెప్పు చూస్తుంటే, రాబోయే పాట ఏ రేంజ్ లో ఉండబోతోందో అర్థమవుతోంది. 'భీమవరం బాల్మ' అంటూ సాగే ఈ మాస్ నంబర్ కోసం ఆడియన్స్ ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. ఈ పోస్టర్ లో నవీన్ పోలిశెట్టి డ్రెస్సింగ్ స్టైల్ హైలైట్ గా నిలిచింది. బ్లూ కలర్ ప్రింటెడ్ షర్ట్, దానికి తగ్గట్టుగా డిజైన్ చేసిన జీన్స్ వేసుకుని ఊర మాస్ లుక్ లో కనిపిస్తున్నాడు. ఇక మీనాక్షి చౌదరి పట్టు పరికిణీలో, ట్రెడిషనల్ గా కనిపిస్తూనే గ్లామర్ టచ్ ఇచ్చింది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ అదిరిపోయింది. ఆ స్టైల్, ఆ ఎనర్జీ చూస్తుంటే సాంగ్ బ్లాక్ బస్టర్ అవ్వడం పక్కా. ముఖ్యంగా ఈ పాట లాంచ్ ఈవెంట్ ను ప్లాన్ చేసిన విధానం చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంది. పాట పేరు 'భీమవరం బాల్మ' కాబట్టి, ఈవెంట్ ను కూడా భీమవరంలోనే ప్లాన్ చేశారు. అక్కడి ఎస్‌కెఆర్‌కె ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం గ్రాండ్‌గా ఈ సాంగ్ లాంచ్ జరగనుంది. స్టూడెంట్స్ మధ్య నవీన్ చేసే రచ్చ ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ పోస్టర్ ద్వారా సినిమా రిలీజ్ డేట్ పై మరోసారి క్లారిటీ ఇచ్చారు. 2026 జనవరి 14న సంక్రాంతి కానుకగా ఈ సినిమా రాబోతోంది. ఈ సినిమాకు మారి దర్శకత్వం వహిస్తున్నారు. ఇక సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు.




# రేపు ఓటీటీలోకి 'మాస్ జాతర'

మాస్ మహారాజా రవితేజ నటించిన తాజా చిత్రం 'మాస్ జాతర' ఓటీటీలోకి వచ్చేస్తోంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. నవంబర్ 28 నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారికంగా ప్రకటించింది. థియేటర్లలో విడుదలైన నెల రోజులు కూడా గడవక ముందే ఈ సినిమా డిజిటల్ వేదికపైకి రావడం గమనార్హం. రవితేజ కెరీర్‌లో 75వ చిత్రంగా ఎన్నో అంచనాల మధ్య 'మాస్ జాతర' అక్టోబర్ 31న థియేటర్లలో విడుదలైంది. అయితే, రొటీన్ కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా నిరాశపరిచింది. భారీ అంచనాలను అందుకోలేక ఫ్లాప్‌గా నిలిచింది. భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటించగా, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించింది. ఇటీవల ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్‌పై సోషల్ మీడియాలో పలు ఊహాగానాలు వచ్చాయి. దీంతో సినీ ప్రియుల్లో కొంత గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో నెట్‌ఫ్లిక్స్ అధికారిక ప్రకటనతో స్పష్టత ఇచ్చింది. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల్లోనూ ఈ సినిమా అందుబాటులో ఉంటుందని నెట్‌ఫ్లిక్స్ తన ప్రకటనలో తెలిపింది. దీంతో థియేటర్లలో చూడలేకపోయిన ప్రేక్షకులు ఓటీటీలో చూసేందుకు సిద్ధమవుతున్నారు.



# ఆస్కార్ బరిలో 'మహావతార్ నరసింహ'


భారతీయ యానిమేషన్ రంగంలో సరికొత్త చరిత్ర సృష్టిస్తూ, విజువల్ వండర్‌గా తెరకెక్కిన 'మహావతార్ నరసింహ' చిత్రం అంతర్జాతీయ వేదికపై సత్తా చాటింది. ప్రతిష్ఠాత్మక 98వ అకాడమీ అవార్డుల (ఆస్కార్స్ 2026) బరిలో ఉత్తమ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీకి అర్హత సాధించిన చిత్రాల జాబితాలో చోటు దక్కించుకుంది. దర్శకుడు అశ్విన్ కుమార్ రూపొందించిన ఈ చిత్రం, ప్రపంచవ్యాప్తంగా పోటీ పడుతున్న 35 మేటి చిత్రాలతో పాటు ఈ అరుదైన గౌరవాన్ని అందుకుంది. భారతీయ పురాణ గాథలకు హాలీవుడ్ స్థాయి సాంకేతికతను జోడించి, క్లీమ్ ప్రొడక్షన్స్ నిర్మించి, హొంబలే ఫిల్మ్స్ సమర్పించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించడమే కాకుండా విమర్శకుల ప్రశంసలు సైతం అందుకుంది. ఇప్పుడు ఆస్కార్ బరిలో నిలవడం భారతీయ సినిమాకు, ముఖ్యంగా యానిమేషన్ పరిశ్రమకు గర్వకారణంగా మారింది. ఈ రేసులో 'మహావతార్ నరసింహ'.. డిస్నీ వారి 'జూటోపియా 2', 'కే పాప్ డెమన్ హంటర్స్', జపాన్‌కు చెందిన 'డెమన్ స్లేయర్: కిమెత్సు నో యాబా-ఇన్ఫినిటీ కాజిల్', 'స్కార్లెట్' వంటి ప్రపంచ ప్రఖ్యాత యానిమేషన్ చిత్రాలతో పోటీపడనుంది.



# భర్తపై సెలీనా జైట్లీ గృహ హింస కేసు

బాలీవుడ్ నటి సెలీనా జైట్లీ తన భర్త పీటర్ హాగ్ పై గృహ హింస కేసు పెట్టారు. తన భర్త నుంచి గృహ హింస, క్రూరత్వం, మానిప్యులేషన్ ఎదుర్కొంటున్నానని ఆరోపిస్తూ ఆమె ముంబై కోర్టును ఆశ్రయించారు. డొమెస్టిక్ వయొలెన్స్ యాక్ట్ కింద కేసు దాఖలు చేయగా, న్యాయస్థానం పీటర్ హాగ్ కు నోటీసులు జారీ చేసింది. ఆస్ట్రియాకు చెందిన వ్యాపారవేత్త, హొటలియర్ అయిన పీటర్ హాగ్ ను సెలీనా 2011లో వివాహం చేసుకున్నారు. వీరికి 2012లో కవల కుమారులు జన్మించారు. ఆ తర్వాత 2017లో మరోసారి కవలలకు జన్మనివ్వగా, వారిలో ఒకరు గుండె సంబంధిత సమస్యతో మరణించారు. సెలీనా జైట్లీ ప్రస్తుతం ఒకేసారి రెండు వైపులా న్యాయపోరాటం చేస్తున్నారు.





# నాకు ఆ బాధ లేదు

కెరీర్ విషయంలో కానీ, రెమ్యూనరేషన్ విషయంలో కానీ హీరోలకు ఉండే విలువ హీరోయిన్లకు ఉండదు. హీరోలకు పదుల కోట్లలో రెమ్యూనరేషన్లు ఇస్తే, హీరోయిన్లకు మాత్రం లక్షల్లోనో లేదంటే హీరో రెమ్యూనరేషన్ లో నాలుగో వంతు కూడా ఇవ్వరు. ఈ విషయంపై కీర్తి సురేష్ స్పందించింది. రెమ్యూనరేషన్ విషయంలో హీరోయిన్లకు తక్కువ ఇస్తున్నారనే విషయం గురించి మాట్లాడుతూ, ఎవరి జీతమైనా వారి పని, మార్కెట్, క్రేజ్ ను బట్టే ఉంటుందని, హీరోలతో కంపేర్ చేస్తే తనకు తక్కువ పారితోషికమిస్తారనే బాధ తనకెప్పుడూ లేదని, ఏదైనా డిమాండ్ ను బట్టే ఉంటుందని ఆమె స్పష్టం చేసింది.

# ఆంధ్రా కింగ్ తాలూకా యూ/ఏ

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా, మహేష్ బాబు పి దర్శకత్వంలో వస్తున్న కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్రా కింగ్ తాలూకా'. ఈ చిత్రం తాజాగా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తమ ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించింది. 'ఆంధ్రా కింగ్ తాలూకా చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ వచ్చింది. అందరూ చూడదగ్గ సినిమా. నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్. బుకింగ్స్ ఇప్పుడు ఓపెన్ అయ్యాయి' అని పోస్ట్ చేసింది. ఈ సినిమాపై రామ్ పోతినేని భారీ అంచనాలు పెట్టుకున్నారు. నటుడిగానే కాకుండా ఈ చిత్రంతో ఆయన గేయ రచయితగా కూడా అరంగేట్రం చేస్తున్నారు. 'నువ్వుంటే చాలే' అనే పాటకు రామ్ స్వయంగా సాహిత్యం అందించారు. వివేక్-మెర్విన్ ద్వయం స్వరపరిచిన ఈ పాటను ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఆలపించారు.




# భాగ్యశ్రీతో ప్రేమాయణంపై రామ్ క్లారిటీ


యంగ్ హీరో రామ్ పోతినేని తన కొత్త చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా' ప్రమోషన్లలో భాగంగా, తనపై వస్తున్న డేటింగ్ రూమర్లపై స్పష్టత ఇచ్చారు. పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా నవంబర్ 27న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ చిత్రంలో రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. సినిమా షూటింగ్ మొదలైనప్పటి నుంచి వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ ప్రచారం జరుగుతోంది. ఈ పుకార్లపై రామ్ స్పందిస్తూ, 'ఈ సినిమా కోసం నేను ఓ ప్రేమ గీతం రాశాను. అప్పటినుంచే ఈ రూమర్స్ మొదలయ్యాయి. మనసులో ఏమీ లేకుండా అంత గొప్పగా పాట ఎలా రాస్తారని చాలా మంది అనుకున్నారు. కానీ నేను కేవలం సినిమాలోని పాత్రలను ఊహించుకొని ఆ పాట రాశాను.

# జిమ్‌లో శ్రేయస్



గాయం నుంచి కోలుకుంటున్న బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టడంపై దృష్టిసారించాడు. అతను జిమ్‌లో నెమ్మదిగా కసరత్తులు చేయడం ప్రారంభించాడు. ఎక్సర్‌సైజ్ బైక్‌పై వ్యాయామం చేస్తున్న ఫొటోను శ్రేయస్ తన ఇన్‌స్టా స్టోరీలో పోస్ట్ చేశాడు. దీంతో అభిమానులు ఖుషీ అవుతున్నారు. అతను వీలైనంత త్వరగా భారత జట్టుకు ఆడాలని కోరుకుంటున్నారు. గత నెల చివరలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో క్యాచ్ అందుకునే క్రమంలో శ్రేయస్ తీవ్రంగా గాయపడ్డాడు. క్యాచ్ అందుకొనే క్రమంలో బలంగా నేలను తాకాడు. దీంతో అతడి ప్లీహానికి తీవ్ర గాయమైంది. వెంటనే ఆస్పత్రికి చికిత్స అందించారు. సిడ్నీలోని ఓ ఆసుపత్రిలో రెండు రోజులు ఐసీయూలో ఉండి చికిత్స చేయించుకున్న అతను.. అక్కడి నుంచి డిశ్చార్జి అయి స్వదేశానికి వచ్చాడు. అప్పటి నుంచి డాక్టర్ దిన్షా పార్దీవాలా.. అయ్యర్ ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల అతను అల్ట్రాసోనోగ్రఫీ పరీక్ష చేయించుకోగా.. మెరుగుదల కనిపిస్తున్నట్లు చెప్పారు. అయితే కడుపుపై ఒత్తిడిని కలిగించే కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. అయ్యర్ పూర్తిగా కోలుకోవడానికి రెండు నెలలకు పైగానే సమయం పడుతుందట. జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు కూడా అతను అందుబాటులోకి రాడట. ఫిట్‌నెస్ సాధించినా మ్యాచ్ ప్రాక్టీస్ ఉండదు కాబట్టి ఫిబ్రవరి-మార్చి నెలల్లో జరిగే టీ20 ప్రపంచకప్ ఎంపికకు శ్రేయస్ పేరును సెలక్టర్లు పరిగణనలోకి తీసుకోవడం కష్టమే. బహుశా మళ్లీ ఐపీఎల్‌లోనే అతణ్ని మైదానంలో చూస్తామేమో!

# వచ్చేశాడు కింగ్..!



భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ మరోసారి మైదానంలోకి దిగనున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో అర్ధ శతకంతో మెరిసిన విరాట్ ఈసారి స్వదేశంలో చెలరేగిపోయేందుకు సిద్ధమవుతున్నాడు. దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ స్క్వాడ్‌లో ఒకడైన కోహ్లీ ముంబై చేరుకున్నాడు. ఆసీస్ పర్యటన తర్వాత లండన్‌లోనే ఉండిపోయిన అతడు మంగళవారం సొంతగడ్డకు తిరిగొచ్చాడు. నలుపు రంగు ప్యాంట్.. చాక్లెట్ కలర్ షర్ట్.. తలకు టోపీ.. కళ్లద్దాలు పెట్టుకొని సింపుల్ లుక్‌లో కనిపించిన రన్ మెషీన్ ఫ్యాన్స్‌తో సెల్ఫీలు దిగాడు. నిరుడు టీ20లకు.. ఈ ఏడాది జూన్‌లో టెస్టులకు వీడ్కోలు పలికిన కోహ్లీ వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. వచ్చే వన్డే వరల్డ్ కప్ ఆడాలనుకుంటున్న విరాట్ ఆస్ట్రేలియా పర్యటనలో రెండు మ్యాచుల్లో సున్నాకే ఔటైనా.. సిడ్నీ వన్డేలో అర్ధ శతకంతో రాణించాడు. ఇప్పుడు స్వదేశంలో దక్షిణాఫ్రికాపై బ్యా ఝులిపించేందుకు ముంబై చేరుకున్నాడు కోహ్లీ. ప్రస్తుతం 50 ఓవర్ల ఆటలో 51 శతకాలు.. 75 హాఫ్ సెంచరీలు బాదిన అతడు.. సఫారీలపై చెలరేగితే మరిన్ని రికార్డులు బద్ధలవ్వడం ఖాయం. నవంబర్ 30న రాంచీ వేదికగా తొలి మ్యాచ్ జరుగనున్నందున.. కోహ్లీ త్వరలోనే స్క్వాడ్‌తో కలువనున్నాడు.

# కేఎస్‌సీఏ అధ్యక్షుడిగా వెంకటేశ్ ప్రసాద్!



కర్ణాటక క్రికెట్ సంఘం తదుపరి అధ్యక్షుడిగా భారత మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్ దాదాపు ఖరారైనట్టే. షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 7న జరగాల్సిన ఎన్నికలకు ముందే ప్రసాద్ విజయం ఖాయమైంది. ఇతరుల నామినేషన్లు తిరస్కరణకు గురికావడంతో ఆయన ఎంపికకు మార్గం సుగమమైంది. దాంతో.. స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే బలపరిచిన ఆయన ఏకగ్రీవంగా ఎంపికవ్వడం లాంఛనమే అనిపిస్తోంది. గతంలో ప్రసాద్ 2010 నుంచి 2013 వరకూ కేఎస్‌సీఏ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం నవంబర్ 30న కర్నాటక క్రికెట్ సంఘానికి ఎన్నికలు జరగాలి. కానీ, ఎన్నికల నిర్వహణాధికారి డాక్టర్.బి. బసవరాజు (మాజీ ఐఏఎస్) క్రికెట్ సంఘం నిర్వహణ కమిటీ నుంచి స్పష్టత లేదని.. వెంటనే కోర్టు జోక్యం చేసుకోవాలని పట్టుపట్టారు. శుక్రవారం ఈ కేసుపై విచారణ చేపట్టిన జస్టిస్ సూరజ్ గోవిందరాజు డిసెంబర్ 7న ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే.. అధ్యక్ష పదవి కోసం గేమ్ ఛేంజర్స్ టీమ్ నుంచి వెంకటేశ్ ప్రసాద్, టీమ్ బ్రిజేశ్ నుంచి కే.ఎన్. శాంత్ కుమార్, కల్పన వెంకటాచార్ నామినేషన్ వేశారు. కానీ, సాంకేతిక కారణాలతో శాంత్ దరఖాస్తును ఎన్నికల అధికారి తిరస్కరించారు. వెంకటాచార్ తన నామినేషన్ వెనక్కి తీసుకున్నారు.




# ఫిబ్రవరి 15న బిగ్ ఫైట్


## ఆ రోజే దాయాదుల పోరు

**టీ20 ప్రపంచకప్-2026 షెడ్యూల్ విడుదల**

టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ వచ్చేసింది. వచ్చే ఏడాది జరగబోయే ఈ టోర్నీకి సంబంధించి షెడ్యూల్‌ను ఐసీసీ మంగళవారం విడుదల చేసింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న ఈ టోర్నీ ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. ఒకవేళ పాకిస్తాన్ జట్టు ఫైనల్‌కు చేరితే కొలంబో వేదికగా ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. భారత్‌లోని ఐదు, శ్రీలంకలోని మూడు వేదికల్లో మ్యాచులు జరుగనున్నాయి. మొత్తం 20 జట్లు పాల్గొననున్నాయి. ఇటలీ మొదటిసారి టోర్నీకి అర్హత సాధించింది. 20 జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతి గ్రూప్ నుంచి రెండేసి జట్లు సూపర్-8కు అర్హత సాధిస్తాయి. సూపర్-8లోని నాలుగు జట్లను రెండు గ్రూప్‌లుగా విభజిస్తారు. ఇందులో టాప్-2 జట్లు సెమీ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లు భారత్‌లోని అయిదు వేదికల్లో (అహ్మదాబాద్, దిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబయి), శ్రీలంకలోని మూడు వేదికల్లో (క్యాండీలోని పల్లెకెలె స్టేడియం, కొలంబోలోని రెండు స్టేడియాల్లో) జరగనున్నాయి. ఈ మెగా టోర్నమెంట్‌కు టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు.

- ఫిబ్రవరి 7న భారత్ - అమెరికా మధ్య మ్యాచ్
- ఫిబ్రవరి 12న భారత్ - నమీబియా మ్యాచ్
- ఫిబ్రవరి 15న భారత్ - పాకిస్తాన్ మ్యాచ్
- ఫిబ్రవరి 18న భారత్ - నెదర్లాండ్స్ మ్యచ్

# నా కొడుకే పెళ్లి వాయిదా వేసాడు: పలాశ్ తల్లి



టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్ పెళ్లి వాయిదా పడిన సంగతి తెలిసిందే. స్మృతి మంధాన స్వస్థలం మహారాష్ట్రలోని సాంగ్లీలో గత ఆదివారం(నవంబర్ 23)మధ్యాహ్నం ఈ పెళ్లి జరగాల్సి ఉండగా.. ఉదయం ఆమె తండ్రి శ్రీనివాస్ మంధాన అస్వస్థతకు గురయ్యారు. ఆయన గుండెపోటు లక్షణాలతో బాధపడటంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తన తండ్రి ఇలాంటి పరిస్థితుల్లో ఉండగా పెళ్లి చేసుకోవడం సరికాదని భావించిన స్మృతి మంధాన.. వివాహాన్ని వాయిదా వేయాలని నిర్ణయించిందని ఆమె మేనేజర్ ప్రకటించారు. అంతేకాకుండా స్మృతి మంధాన తన సోషల్ మీడియా ఖాతాల నుంచి వివాహానికి సంబంధించిన పోస్ట్‌లను తొలగించింది.



# ఖేల్ ఖతమ్!




**మరో ఓటమి అంచున టీమిండియా.. 522 పరుగుల వెనుకంజలో మనోళ్లు.. డ్రా అయితే ఊరట.. ఓడితే స్వీప్**

**సౌతాఫ్రికాతో రెండో టెస్ట్‌లో టీమిండియా చేతులెత్తేసింది. 549 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 15.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్(13), కేఎల్ రాహుల్(6) దారుణంగా విఫలమయ్యారు. నైట్‌వాచ్‌మన్‌గా కుల్దీప్ యాదవ్(2 బ్యాటింగ్) బ్యాటింగ్‌కు రాగా.. సాయి సుదర్శన్(2 నాటౌట్)మరో వికెట్ పడకుండా ఆటను ముగించాడు.**


ప్రస్తుతం భారత్ 522 పరుగుల వెనుకంజలో ఉంది. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమిని తప్పించుకోవాలంటే ఆఖరి రోజైన బుధవారం మొత్తం బ్యాటింగ్ చేయాలి. లేదంటే టీమిండియా ఘోర పరాజయం తప్పదు. సౌతాఫ్రికా విజయానికి 8 వికెట్లు కావాలి. ప్రస్తుతం సౌతాఫ్రికా బౌలర్లు ఉన్న ఫామ్ నేపథ్యంలో భారత ఓటమి పెద్ద కష్టమేం కాదనిపిస్తోంది. ఇప్పటికే పిచ్‌పై పగుళ్లు ఏర్పడి స్పిన్నర్లకు అడ్వాంటేజ్‌గా మారింది. ఆఖరి రోజు పిచ్ స్పిన్నర్లకు మరింత అనుకూలంగా మారనుంది. అంతకుముందు 26/0 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన సౌతాఫ్రికా 78.3 ఓవర్లలో 260/5 స్కోర్ వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దాంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 288 పరుగులు కలుపుకొని మొత్తం 548 పరుగుల ఆధిక్యం సాధించింది. సఫారీ బ్యాటర్లలో ట్రిస్టన్ స్టబ్స్(180 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 94) తృటిలో సెంచరీ చేజార్చుకోగా.. టోనీ డీ జోర్జి(68 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 49) హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా ఒక్కడే(4/62) నాలుగు వికెట్లు తీయగా.. వాషింగ్టన్ సుందర్(1/67) ఒక వికెట్ పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగుల భారీ స్కోర్ చేసింది. సెనరన్

**సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 489 ఆలౌట్**
**భారత్ తొలి ఇన్నింగ్స్ 201 ఆలౌట్**
**సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 260/5 డిక్లేర్డ్**
**భారత్ రెండో ఇన్నింగ్స్ 27/2**




ముత్తుసామి(206 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 109) సెంచరీ సాధించగా.. మార్కో జాన్సెన్(91 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 93) తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. అనంతరం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 201 పరుగులకే ఆలౌటైంది. యశస్వి జైస్వాల్(58), వాషింగ్టన్ సుందర్(48) మినహా మరే బ్యాటర్ రాణించలేదు. మార్కో జాన్సెన్ 6 వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు. ఇప్పటికే ఈ సిరీస్‌లో సౌతాఫ్రికా 1-0తో ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్ డ్రా అయినా సిరీస్‌ను ఆ జట్టే కైవసం చేసుకుంటుంది.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
బుధవారం 26-11-2025 | www.evarthalu.com




# అంతా నా ఇష్టం.. రాజ్యాంగం చలవే!


భారతదేశ చరిత్రలో నవంబర్ 26 ఒక సువర్ణాధ్యాయం. సరిగ్గా 76 సంవత్సరాల క్రితం, 1949 నవంబర్ 26న, మన దేశ రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించింది. ఇది కేవలం ఒక చారిత్రాత్మక ఘట్టం మాత్రమే కాదు, వందల ఏళ్ల వలస పాలన నుంచి విముక్తి పొందిన ఒక సార్వభౌమ దేశం, తన భవితవ్యాన్ని తానే నిర్దేశించుకోవడానికి వేసిన పటిష్టమైన పునాది. 2015 నుంచి ఈ రోజును 'రాజ్యాంగ దినోత్సవం' (సంవిధాన్ దివస్)గా అధికారికంగా జరుపుకుంటున్నాం. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన లిఖిత రాజ్యాంగం. ఇది దేశ శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలకు దిశా నిర్దేశం చేసే అత్యున్నత చట్టపరమైన పత్రం.

ఇది పౌరులకు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి ప్రాథమిక విలువలను అందిస్తుంది. 2025లో హమారా సంవిధాన్ %-% హమారా స్వాభిమాన్ (మన రాజ్యాంగం - మన ఆత్మగౌరవం) అనే థీమ్‌తో జరుపుకుంటున్న ఈ సందర్భం, రాజ్యాంగ విలువలను ప్రతి పౌరుడికి చేరువ చేయాల్సిన ఆవశ్యకతను మరోసారి గుర్తుచేస్తోంది. భారత రాజ్యాంగ రూపకల్పన ప్రక్రియ సుదీర్ఘమైనది. 1946 డిసెంబర్ 9న రాజ్యాంగ సభ తొలి సమావేశం జరిగింది. 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజుల పాటు విస్తృతమైన చర్చలు, సంప్రదింపులు జరిగాయి. ఈ బృహత్తర కార్యాన్ని దిగ్విజయంగా పూర్తి చేయడంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పాత్ర అసాధారణమైనది. ఆయన 'డ్రాఫ్టింగ్ కమిటీ' (రాజ్యాంగ ముసాయిదా కమిటీ) ఛైర్మన్‌గా వ్యవహరించారు. అంబేద్కర్ కేవలం ముసాయిదాను రూపొందించడంలోనే కాకుండా, రాజ్యాంగంలోని ప్రతి అంశంపైనా లోతైన చర్చలు జరిపి, తన న్యాయ పరిజ్ఞానంతో, దూరదృష్టితో మార్గనిర్దేశం చేశారు. ఆయన అందించిన ప్రాథమిక హక్కులు, అంటరానితనం నిర్మూలన, బలహీన వర్గాల రక్షణ వంటి నిబంధనలు సామాజిక న్యాయం పట్ల ఆయనకున్న అచంచలమైన నిబద్ధతకు నిదర్శనం. అందుకే ఆయన్ని 'భారత రాజ్యాంగ పితామహుడి'గా గౌరవిస్తున్నాం. ఆయన అపారమైన న్యాయ పరిజ్ఞానం, ప్రపంచ రాజ్యాంగాలపై ఆయనకున్న పట్టు, మరియు అన్నింటికీ మించి, సామాజిక న్యాయం పట్ల ఆయనకున్న అచంచలమైన నిబద్ధత, రాజ్యాంగానికి ఒక పటిష్టమైన రూపాన్ని ఇచ్చాయి. రాజ్యాంగంలోని ప్రతి అధికరణంపైనా లోతైన మేధోమథనం జరిగింది. 7,600కుపైగా సవరణలు ప్రతిపాదించారు. అంబేద్కర్, తన సహచరులతో కలిసి, ఈ చర్చలన్నింటినీ సమన్వయం చేస్తూ, అంతిమంగా ఒక సమగ్రమైన, సమతుల్యమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించారు. రాజ్యాంగ రచనలో ఆయన చూపిన దార్శనికత, ముఖ్యంగా ప్రాథమిక హక్కులు, అంటరానితనం నిర్మూలన (ఆర్టికల్ 17), బలహీన వర్గాలకు రిజర్వేషన్లు, మరియు ఆదేశిక సూత్రాలలో పొందుపరిచిన సంక్షేమ భావనలు, అప్పటి సామాజిక అసమానతలను రూపుమాపే దిశగా వేసిన విప్లవాత్మక అడుగులు. ఏటా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవడం యొక్క ముఖ్య ఉద్దేశ్యం - రాజ్యాంగ విలువలపై పౌరులలో, ముఖ్యంగా యువ తరంలో అవగాహన పెంచడం. రాజ్యాంగం మనకు హక్కులను ప్రసాదించడమే కాకుండా, మన ప్రాథమిక విధులను కూడా గుర్తు చేస్తుంది. గత 75 సంవత్సరాలుగా భారత ప్రజాస్వామ్యం నిలదొక్కుకోవడానికి, అనేక సంక్షోభాలను తట్టుకోవడానికి ప్రధాన కారణం మన రాజ్యాంగం అందించిన పటిష్టమైన వ్యవస్థలే. స్వతంత్ర న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలు దేశంలో చట్టబద్ధమైన పాలనను కొనసాగించడానికి కృషి చేస్తున్నాయి. అయినప్పటికీ, నేటికీ మనం రాజ్యాంగ ఆశయాలను పూర్తిగా సాధించామా అనేది ప్రశ్నార్థకమే. సమానత్వం, సామాజిక న్యాయం, ఆర్థిక అసమానతల నిర్మూలన వంటి సూత్రాలను ఆచరణలో నూటికి నూరు శాతం అమలు చేయాల్సిన అవసరం ఇంకా ఉంది. రాజకీయాలలో నేరమయమైన వ్యక్తుల ప్రవేశం, మతతత్వం, అవినీతి వంటి అంశాలు రాజ్యాంగ విలువలకు సవాళ్లు విసురుతున్నాయి. నేటి యువతరం రాజ్యాంగం యొక్క ప్రాముఖ్యాన్ని తెలుసుకోవాలి. రాజ్యాంగం పట్ల గౌరవం, చట్టబద్ధమైన పాలన పట్ల విశ్వాసం, బహుళత్వ సమాజంలో సహనంతో జీవించడం వంటివి ప్రతి పౌరుడు అలవర్చుకోవాలి. ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా, ఈ విలువల పట్ల మన కర్తవ్యాన్ని మనం విస్మరించకూడదు. రాజ్యాంగం అమలులోకి వచ్చి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ, అందులో పొందుపరిచిన ఆశయాలను పూర్తిగా సాధించామా? అనేది నేటికీ చర్చనీయాంశమే. దేశం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లను అధిగమించడానికి రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు సాగాలి.

**- విద్యుల్లత పరంకుశం, సీనియర్ అడ్వకేట్**

# 'గుర్తు' లేని గుర్తింపు!

సర్పంచ్ ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. అయితే, రాజకీయ పార్టీలు తమ పార్టీది గెలుపు అంటే తమ పార్టీదే గెలుపు అంటూ బలప్రదర్శనకు దిగాయి. మరి.. సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ గుర్తు ఉంటుందా? అంటే ఉండదు. కానీ..వాస్తవ రాజకీయం మాత్రం అధికారిక నిబంధనలకు భిన్నంగా, పార్టీల మద్దతుతోనే నడుస్తోంది.




గ్రామ పంచాయతీ ఎన్నికలు స్థానిక, వ్యక్తిగత ప్రాతిపదికన జరగాలనేది చట్టం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. అందుకే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో అభ్యర్థులకు రాజకీయ పార్టీల గుర్తులను కేటాయించరు. బదులుగా, రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన ఉచిత గుర్తులను మాత్రమే అభ్యర్థులు ఎంపిక చేసుకోవాలి. పార్టీ జెండాలు, బ్యానర్లు, అధికారిక పార్టీ నేతల ఫొటోలను ప్రచారంలో ఉపయోగించడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లే అవుతుంది. అధికారికంగా పార్టీ గుర్తులు లేనప్పటికీ, రాజకీయ పార్టీలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడానికి బలమైన కారణాలు ఉన్నాయి. స్థానిక స్థాయిలో పట్టు సాధించడం ద్వారా తమ పార్టీ బలాన్ని నిరూపించుకోవాలని, భవిష్యత్ సార్వత్రిక ఎన్నికలకు పునాది వేసుకోవాలని ప్రధాన పార్టీలు భావిస్తాయి. పార్టీలు నేరుగా గుర్తు ఇవ్వకపోయినా, తెర వెనుక తమ పార్టీ మద్దతుదారులైన అభ్యర్థులకు మద్దతునిస్తాయి. ఎమ్మెల్యేలు, స్థానిక నేతలపై ఈ బాధ్యతను ఉంచుతారు. గెలిచిన అభ్యర్థులు తమ పార్టీకి చెందినవారేనని ప్రచారం చేసుకోవడం ద్వారా నైతిక విజయాన్ని సాధించాలని చూస్తాయి. గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి పెద్ద ఎత్తున నిధులు వస్తాయి. తమ మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఉంటే ఈ నిధుల వినియోగంలో పట్టు సాధించవచ్చని, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయవచ్చని (లేదా అడ్డుకోవచ్చని) భావిస్తారు. మొత్తంగా, సర్పంచ్ ఎన్నికలు చట్ట ప్రకారం పార్టీ రహితంగా జరిగినా, రాజకీయ వాతావరణం మాత్రం పూర్తిగా పార్టీల ప్రభావంతోనే కొనసాగనుంది.

# 26/11.. పదిహేడేళ్ల విషాదం



భారత ఆర్థిక రాజధాని ముంబైకి 2008, నవంబర్ 26 రాత్రి భారతీయుల గుండెల్లో మానని గాయం. ఆ రోజును తలుచుకుంటే గుండె బరువెక్కుతుంది. టీవీ తెరల ముందు కూర్చున్న కోట్లాది మంది భారతీయులు, ఉగ్రవాదుల పాశవికత్వాన్ని చూసి నిర్ఘాంతపోయారు. ఆ దాడులు కేవలం భవనాలపైనో, వ్యక్తులపైనే జరిగినవి కావు.బీ అవి భారత సార్వభౌమాధికారంపై, శాంతియుత సహజీవనంపై జరిగిన ప్రత్యక్ష దాడి. ఆ నరమేధానికి సరిగ్గా పదిహేడేళ్లు పూర్తయిన సందర్భంగా, ఆ విషాదాన్ని స్మరించుకుంటూనే, ఉగ్రవాద నిర్మూలనకు మనం ఎంతవరకు సిద్ధంగా ఉన్నామనే విషయాన్ని విశ్లేషించుకోవాలి. సాయంత్రం వేళ సందడిగా ఉండే ఛత్రపతి శివాజీ టెర్మినస్ రైల్వే స్టేషన్ ఒక్కసారిగా రక్తసిక్తమైంది. ఆ తర్వాత లియోపోల్డ్ కేఫ్, తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్, ఒబెరాయ్ ట్రైడెంట్, నారిమన్ హౌస్... ఇలా ఒకదాని తర్వాత ఒకటి ఉగ్రవాదుల కాల్పులతో దద్దరిల్లిపోయాయి. సముద్ర మార్గం గుండా వచ్చిన పది మంది లష్కరే తోయిబా ఉగ్రవాదులు మూడు రోజుల పాటు ముంబైని తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. మీడియా కవరేజ్ కారణంగా, ఆ దాడుల భీభత్సం ప్రపంచం నలుమూలలా ప్రత్యక్షంగా కనిపించింది. హోటళ్లలో చిక్కుకున్న పర్యాటకులు, ప్రాణాల కోసం ఆర్తనాదాలు చేస్తున్న సామాన్యులు, కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం రోదిస్తున్న బంధువులు... ఈ దృశ్యాలు ఇంకా మన మదిలో పచ్చిగానే ఉన్నాయి.



**అభిషేక్ కురుమ**

ఈ దాడుల్లో 166 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయపడ్డారు. మృతుల్లో విదేశీ పౌరులు కూడా ఉన్నారు, ఇది ఉగ్రవాదానికి దేశ సరిహద్దులు లేవని నిరూపించింది. అయితే, ఈ భీకర పరిస్థితుల్లో మన భద్రతా దళాలు చూపిన తెగువ, త్యాగం చిరస్మరణీయమైనవి. ముంబై పోలీసు అధికారులు హేమంత్ కర్కరే, అశోక్ కామ్టే, విజయ్ సలాస్కర్ వంటి వీరులు ఉగ్రవాదులను ఎదుర్కొంటూ అమరులయ్యారు. నేషనల్ సెక్యూరిటీ గార్డ్ కమాండోలు చివరి ఉగ్రవాదిని మట్టుపెట్టడానికి ప్రాణాలను పణంగా పెట్టారు. మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ వంటి సైనికులు 'పైకి రాకండి, నేను చూసుకుంటాను' అంటూ చివరి శ్వాస వరకు పోరాడారు. వారి త్యాగాలు, దేశభక్తి ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకం. ఈ దాడుల వెనుక పాకిస్తాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ హస్తం ఉందని స్పష్టంగా తేలింది. పట్టుబడిన ఏకైక ఉగ్రవాది అజ్మల్ కసబ్ ఇచ్చిన వాంగ్మూలం, దర్యాప్తు సంస్థలు సేకరించిన ఆధారాలు ఈ విషయాన్ని బలంగా నిరూపించాయి. పాకిస్తాన్ గడ్డపై నుంచే ఈ దాడులకు ప్లాన్ చేశారని, అక్కడి నుంచే ఉగ్రవాదులకు దిశానిర్దేశం జరిగిందని ప్రపంచానికి తెలిసింది. భారత్ ఈ విషయాన్ని అంతర్జాతీయ వేదికలపై బలంగా వినిపించింది. ఐక్యరాజ్యసమితి, అమెరికా వంటి దేశాలు పాకిస్తాన్‌పై ఒత్తిడి తెచ్చాయి. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్న పాక్ తన భూభాగం నుంచి పనిచేసే ఉగ్రవాద సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. కసబ్‌కు ఉరిశిక్ష అమలు చేయడం ద్వారా భారత్ తన న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని చాటింది. అయితే, దాడుల ప్రధాన సూత్రధారులు ఇప్పటికీ పాకిస్తాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతుండటం, వారిపై చర్యలు తీసుకోవడంలో ఆ దేశం మీనమేషాలు లెక్కించడం దారుణం. ఇది ఉగ్రవాదం పట్ల పాక్ వైఖరిని స్పష్టం చేస్తుంది. 26/11 దాడుల తర్వాత దేశ భద్రతా వ్యవస్థలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. సముద్ర తీర భద్రతను బలోపేతం చేశారు. నిఘా వ్యవస్థలు, ఇంటెలిజెన్స్ షేరింగ్ మెకానిజమ్స్ మెరుగుపడ్డాయి. జాతీయ భద్రతా దళం ప్రాంతీయ కేంద్రాలను ఏర్పాటు చేశారు, తద్వారా తక్షణ ప్రతిస్పందన సమయం తగ్గింది. ఈ చర్యలు కొంతవరకు భద్రతను మెరుగుపరిచినప్పటికీ, ఇంకా సవాళ్లు అనేకం ఉన్నాయి. ఉగ్రవాదం తన రూపాన్ని మార్చుకుంటోంది. సైబర్ స్పేస్, డ్రోన్ల వినియోగం ద్వారా దాడులకు పాల్పడే ప్రమాదం పొంచి ఉంది. సోషల్ మీడియా ద్వారా యువతను ప్రభావితం చేయడం, 'లోన్ వోల్ఫ్' దాడులకు పురిగొల్పడం వంటి కొత్త వ్యూహాలను ఉగ్రవాద సంస్థలు అనుసరిస్తున్నాయి. కాబట్టి, మనం సాంకేతికంగా, వ్యూహాత్మకంగా ఎప్పుడూ ఒక అడుగు ముందే ఉండాలి. నవంబర్ 26 కేవలం ఒక జ్ఞాపకం కాదు, అది ఒక మేల్కొలుపు. అమరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండాలి. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్'తో పాటు 'సబ్ కా విశ్వాస్' సాధించినప్పుడే దేశ సమైక్యత బలపడుతుంది. మత విద్వేషాలకు తావులేకుండా, ఐకమత్యంతో ఉన్న సమాజాన్ని నిర్మించినప్పుడే ఉగ్రవాదుల పన్నాగాలు విఫలమవుతాయి. ఉగ్రవాదంపై పోరాటం అనేది కేవలం ప్రభుత్వానికో, భద్రతా దళాలకో పరిమితం కాదు. అది ప్రతి భారతీయుడి బాధ్యత. ఆ రోజు ప్రాణాలు కోల్పోయిన అమాయకులకు, వీర మరణం పొందిన జవాన్లకు మనం ఇచ్చే నిజమైన నివాళి %-% ఉగ్రవాద రహిత సమాజాన్ని నిర్మించడానికి, దేశ భద్రతకు కట్టుబడి ఉండటానికి పునరంకితం కావడమే. 26/11 విషాదం మన స్మృతిపథంలో మెదులుతున్నంత కాలం, ఈ సంకల్పం మరింత బలంగా ఉండాలి. జైహింద్!

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.